# శ్రీసన్నిధానం

సంపుటి 1 సంచిక 12 డిసెంబర్ 2022



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## ఇందులో

3. సంపాదకీయం

4. మార్గశీర్షం మార్గళి భక్తి మాధుర్యం

5. మన దేవాలయాలు

యుగ యుగాల యోగానంద మూర్తి

6. రామానుజ సుధామాధురి

వాత్సల్యం వరదాయకం

8. శ్రీపతిస్తుతి

9 తిరప్పావైలో దివ్యదేశ ప్రస్తుతి

10. డా॥ వరదాచార్యులకు వందనం.

11 శ్వాస్ ద్వితీయ వార్షిక వేడుకల

సంరంభ వేడుకలు విశేషాలు

**సంపాదక మండలి**

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

**గౌరవ సంపాదకులు**

శ్రీమాన్ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ అమరవాది వెంకటనర్సింహా చార్యులు



## ముఖచిత్ర పరిచయం

సంస్కృతీ సంప్రదాయాలను దశదిశలా వ్యాపింపజేయడడానికి శ్రీవైష్ణవ సమాజ ఉద్ధరణకు ఉద్భవించిన శ్వాస్‌కు రెండేళ్లు. శ్రీనివాస స్వరూపులైన శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ చిన్నజీయరు స్వామి వారి మంగళాశాసనాలతో దినదిన ప్రవర్ధమానంగా శ్వాస్ ముందుకు వెళుతోంది. పుట్టిన రెండేళ్లలో శ్వాస్ అనే పాప బుడిబుడి అడుగులు వేయడం కాదు సంప్రదాయానికి వన్నెతెచ్చేలా పరుగులు పెడుతోంది. గ్రామగ్రామాన శ్రీవైష్ణవ కుటుంబాలలో కొత్త ఆశలు చిగురించేలా సరికొత్త ప్రణాళికలను సిద్ధం చేసుకుని నేనున్నాను అంటూ శ్వాస్ నిలిచే ప్రయత్నం. సభ్యుల్లో నూతనోత్సాహం వెల్లి విరిసి రెండవ వార్షికోత్సవ లోగోను స్వామి వారి చరణాల చెంత ఉంచి. మేమంతా రామానుజ సైనికులం. నమ్మిన బంటుల్లా నూతనతరం కోసం సంప్రదాయ వారధిని నిర్మించడానికి సిద్ధంగా ఉన్నామన్న ఉత్సాహం సూర్యాపేట వేదికగా వినిపించారు. చిన్నపిల్లల్లో సైతం శ్రీవైష్ణవం విలువ తెలిసేలా చైతన్యం వెలుగులు విరజిమ్మినట్లు చిచ్చరపిడుగు లాంటి బాలుడు పలికిన మాటలు ఔరా! అనిపించేటంతటి స్ఫూర్తిని కలిగించింది. అది భవిష్యత్ వెలుగురేఖలకు నాందిలా నిలిచింది. రండి! రండి!! పరుగు పరుగునా పదండి ముందుకు పదండి సంప్రదాయ సిరులు పంచే శ్వాస్ వెంట!

**PUBLISHED BY :** డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 040 35756519; 9502583323;

నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# ఈ ఆదరణ! సత్కారం మీ అందరిదీ!!

ఆచార్య నిష్ఠ, భగవత్ సేవ, భాగవత సేవ, జాతీయ స్ఫూర్తి లక్ష్యంగా ఆవిర్భవించిన శ్రీ సన్నిధానం లక్ష్య సాధనలో చేస్తున్న పనులకు పలుమార్లు గుర్తింపు లభించిన సందర్భాలు ఉన్నాయి. శ్రీ సన్నిధానం లక్ష్య సాధన కోసం ట్రస్ట్‌గా క్రమంగా రూపుదిద్దుకుంది. ఇందులో భాగంగానే పలు కార్యక్రమాలు చేపడుతూ వస్తోంది. శ్రీ సన్నిధానం ఆధ్యాత్మిక డిజిటల్ పత్రికను రూపొందించి ఉచితంగా అందజేసే ప్రయత్నం చేస్తోంది. అయితే సబ్‌స్క్రైబ్ చేసుకున్న వారికి ముద్రణ ప్రతిని అందించే పని కూడా నిర్వహిస్తోంది. ఈ సందర్భంలోనే శ్వాస్ తొలి వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న విషయం, శ్వాస్ లక్ష్యం తెలుసుకొని అక్షర కైంకర్యం చేయాలని అభిలాష పడి ముందుకు వచ్చింది. ఈ విషయాన్ని ఆనాడు శ్వాస్ పాలక మండలికి వివరించింది. నాడు వారు మాఉత్సాహాన్ని స్వాగతించారు. తొలి వార్షికోత్సవ వేడుకలు ముచ్చింతలులోని జీయర్ ఆశ్రమంలో నిర్వహిస్తున్నారని తెలుసుకొని, కార్యక్రమం ఆస్వాదించి అందులోని ప్రతి విషయాన్ని అక్షర రూపంగా కైంకర్యంగా అందించే ప్రయత్నం చేసింది. సుమారు 24 పేజీల సంచికను గత నవంబర్లో రూపొందించి అందించాము. వార్షికోత్సవ విషయాల సమగ్ర సమాచారంతో రూపొందించిన సంచికను జీయర్ చిన్న జీయర్ చరణాల చెంత ఉంచి ఆనందపడిన సందర్భంలో మావెంట శ్వాస్ పాలకమండలి ఉంది. శ్రీమాన్ పీతాంబరం వేంకట కిశోర్‌గారు, శ్రీమాన్ మంగళగిరి యాదగిరి స్వామి వారలు ఇచ్చిన ప్రోత్సాహం మాకు మరింత ఉత్సాహం ఇచ్చింది. సంచిక తిలకించిన శ్రీశ్రీశ్రీ త్రిదండి రామానుజ చిన్న జీయరు స్వామి వారు చిరునవ్వు నవ్వి మంగళా శాసనాలు అనుగ్రహించారు. నాడు శ్రీసన్నిధానం తొలిపత్రికను కూడా వారే శ్రీహస్తాలతో సంప్రదాయ సేవలో కొనసాగాలంటూ రెండు దశాబ్దాలకు పూర్వమే మంగళాశాసనాలు అనుగ్రహించారు. అదే స్ఫూర్తితో సంచికను మరింత సుందరంగా అందిచే ప్రయత్నం చేస్తున్నాము. చాలా కాలం తరువాత స్వామి అనుగ్రహం, చిరునవ్వు రూపంలో లభించిందని సంతసించాము. ఆవెంటనే శ్వాస్ తొలివార్షికోత్సవ సంచిక ముద్రణ హక్కులను శ్వాస్ కమిటీకి అప్పగించాము. ఇలా ఆనాడు శ్రీ సన్నిధానం సంపాదక మండలి చేసిన ప్రయత్నాన్ని ఆనాడు సాదరంగా ఆహ్వానించిన శ్వాస్ తిరిగి రెండవ వార్షికోత్సవ సందర్భంగా గుర్తు చేసుకుని అభినందించింది. అంతేకాకుండా రెండవ వార్షికోత్సవ సమాచారాన్ని కూడా పత్రికలో ఇవ్వండని తెలియజేసింది. భాగవతోత్తముల సేవ చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండే శ్రీసన్నిధానం డిసెంబర్ సంచికలో అదనపు పేజీలను జోడించి సుందరంగా అందించే ప్రయత్నం చేసింది. ఈ మా ప్రయత్నాన్ని ప్రోత్సహిస్తారని ఆదరిస్తారని శ్రీ సన్నిధానం ఆశిస్తోంది.

శ్రీ సన్నిధానం ఆశలు ఆశయాలు చాలా కష్టసాధ్యమైనవి అయినా సంపాదక మండలి అకుంఠిత దీక్షతో పనిచేస్తున్నది. ఇందులో భాగంగానే ఆచార్య నిష్ఠతో సమతా మూర్తి ఆవిష్కరణ మహోత్సవ ఘట్టంలో కంకణ బద్ధులై పాల్గొంది. మహోత్సవ విశేషాలతో సంచికలను అందించింది. పాఠకులు ఆదరించారు. సుదూర ప్రాంతాలలో ఉన్న మా కన్నులకు కట్టినట్టు అక్షర రూపంలో సంచికను అందించారు అని వెన్ను తట్టి ప్రోత్సహించారు. అనుక్షణం ఆచార్య నిష్ఠతో పనిచేస్తున్న శ్రీసన్నిధానాన్ని ఆహ్వానించండి మీరు మీ కుటుంబంలో మమ్ము చేర్చుకోండి. శ్రీసన్నిధానంనకు లభించిన ఆదరణ సత్కారం మీ అందరిదీ.

– చీఫ్ ఎడిటర్

# మార్గశీర్షం మార్గళి భక్తి మాధుర్యం

భారతీయ జీవన విధానంలో వినిపించే జనశ్రుతులు ఎన్నో విశ్వాసాలకు అద్దం పడతాయి. సంప్రదాయంలో ఆచరించే వ్రత ఫలశ్రుతులు ఆ నమ్మకాలను బలపరుస్తాయి. పూర్వీకులు ఆచరించిన ఆచరణా ఫలితాలను తెలియజేస్తాయి. ఆ విధంగానే సంస్కృతి, సాంప్రదాయ ఆచరణలు దృఢ పడతాయి. అనుభవైక వేద్యాలై అవశ్యా చరణలుగా స్థిర పడతాయి. ముఖ్యంగా వైదిక ధర్మాచరణలు పురాణోక్త విధి విధానాలు అన్ని హేతుబద్ధమైనవి అయి ఉన్నాయి. సత్ఫలాలను ఇచ్చేవయే ఉన్నాయి. అందుకే భారతీయ సంస్కృతి ఆచరణలు నిత్య నూతనంగా ఉండి సదా సర్వకాలం అనుసరించ బడుతున్నాయి. ఏదేశ సంస్కృతి అయినా ఆదేశం యొక్క భౌగోళిక వాతావరణ ప్రభావం అంతర్లీనంగా ఉంటుంది. ఒక మాసంలో వచ్చే పండగలను కూడా ఋతుకాల వాతావరణాలు ప్రభావిత పరుస్తాయి. మార్గశిర మాసం వర్షాలు పోయి శీతల వాతావరణం నెలకొని ఉంటుంది. పగటి వేళ తక్కువగా ఉండి, సుదీర్ఘ నక్తాలు (రాత్రులు) ఉంటాయి. ఆధ్యాత్మిక భావోద్బుద్ధమైన వాతావరణం ఉంటుంది. మానవ శరీరంలోని కుండలిని శక్తి ఉత్తేజితమయ్యే కాలంగా సాధకులకు అనువైన మాసంగా భావిస్తారు. సూర్యుడు ధనుర్ రాశిలో ప్రవేశించే ఉత్తరాయణ పుణ్యకాలం కూడా ఈ మాసంలోనే వస్తుంది. శ్రీ వైష్ణవ సంప్రదాయంలో ధనుస్సంక్రమణం జరగగానే తిరుప్పావై వ్రతాచరణం ప్రారంభం అవుతుంది. ద్రావిడ సాంప్రదాయంలో ఆళ్వారుగా, భూదేవి అవతారంగా భావింపబడే శ్రీ గోదాదేవిచే విరచితమైన తిరుప్పావై దివ్య ప్రబంధాన్ని అనుసంధిస్తూ ప్రత్యేక ఆరాధనలు చేస్తారు. శ్రీవైష్ణవ దేవాలయాల్లో, గృహాల్లో అద్భుతంగా జరిగే ఈ వ్రతము పుష్య మాసంలో మకర సంక్రమణానికి ముందు రోజు గోదా కళ్యాణం తో ముగుస్తుంది.



మార్గశిర లక్ష్మీ ఆరాధనలు కూడా ప్రత్యేకంగా చేస్తారు. శ్రీకృష్ణుని చేత కుంతీదేవికి ఉపదేశించిన వ్రతంగా లక్ష్మీ వ్రత కథ చెప్పబడుతుంది.వైకుంఠ ఏకాదశి దేవాలయాల్లో గొప్ప ఉత్సవాన్ని జరుపుతారు. ముక్కోటి ఏకాదశి ముక్కోటి దేవతలు పరమాత్ముని వైకుంఠ ద్వార మందు దర్శించుకునే రోజుగా దేవాలయాల్లో సంవత్సరానికి ఒకసారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేస్తారు. ప్రధానంగా తిరుపతిలో సంవత్సరానికి ఒకసారి మాత్రమే వైకుంఠ ద్వారం నుండి దర్శనాలను ఏర్పాటు చేస్తారు.

మార్గశిరమని మృగశిర నక్షత్ర నామంతో పిలిచే ఈ మాస నామానికి ఎన్నో నిర్వచనాలు పెద్దలు చెప్తారు."మాసానాం మార్గశీర్షోహం" అని శ్రీకృష్ణ భగవానుని యొక్క గీతోక్తిగా, మార్గాలలోకి శ్రేష్టమైనదిగా చెప్పబడింది. ధనస్సు ఓంకారానికి ప్రతీక కనుక ఓంకారము జీవాత్మ పరమాత్మ సంబంధాన్ని తెలియజేస్తుంది. కనుక భగవత్ తత్వదర్శనానికి ఇది అనువగు కాలమని పెద్దలు పూర్వాచార్యులు తెలియచెప్పారు. తొలి పంటలు చేతికందే సంక్రాంతి పండుగ వరకు ప్రసిద్ధ పండుగలు ఏవీ లేకున్నను మాసమంతా ఆధ్యాత్మిక భావనా పౌష్కల్యంతో పరవశించే మాసం మార్గశీర్ష మాసం. చతుర్థిని సంకటహర చతుర్థి అని విఘ్నేశ్వరుని పూజించటం. పంచమిన నాగేంద్రుని పూజించడం అష్టమిన దుర్గాదేవిని పూజించటం, షష్టి స్కంధ షష్టి అని సుబ్రహ్మణ్య స్వామిని పూజించటం. సప్తమిన సూర్య భగవానుని పూజించటం. ఏకాదశి క్షీరాబ్దినాధుని, ద్వాదశి లక్ష్మీనారాయణులను పూజించటం సాంప్రదాయంగా వస్తున్నది. మార్గశిర మాస పర్వదినాల గురించి పెద్దల మాటగా తెలుసుకుందాము.

శుద్ధ పాడ్యమి నదీ స్నానం శ్రేష్ఠం. **(మిగతా 7 వ పేజీలో)**

# యుగ యుగాల యోగానంద మూర్తి

## మన దేవాలయాలు

### నిత్య మహిమల నింబాద్రి స్వామి వైభవం



అనూహ్య మైన మహిమలతో అందమైన అడవీ ప్రాంతంలో అలరారే పుణ్య క్షేత్రం లింబాద్రి క్షేత్రం. శ్రీ యోగానంద లక్ష్మి నరసింహ స్వామి వెలసిన క్షేత్రం. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం లో ఉంది. ద్వైత సిద్ధాంత పరంపరలోని శ్రీమద్ మధ్వాచార్య శిష్య పరంపరలో దేవాలయ నిర్వహణ సాగుతున్నది. స్వామి సంకల్పం చేత తిరుమణి తిరు ఊర్ధ్వ పుండ్రాలను (శ్రీ వైష్ణవ సాంప్రదాయలోవలె) ధరింప చేస్తారు. అన్ని సాంప్రదాయాల వారికి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఇలవేల్పుగా ఉన్నారు. నింబము అంటే వేప చెట్టు. వేప చెట్లు ఎక్కువగా ఉన్న క్షేత్రం కనుక ఈ క్షేత్రానికి నింభాచలము అని, ఈ క్షేత్ర మహాత్మ్యము బ్రహ్మ వైవర్తక పురాణములో స్పష్టముగా చెప్పబడినది. ఈ క్షేత్రములో ప్రహ్లాదుని తపస్సు మేరకు స్వామివారు అవతరించారు. ప్రహ్లాదుని తర్వాత బ్రహ్మదేవుడు, రుద్రదేవుడు, వాయుదేవుడు అనేక మంది ఋషులు మునులు తపస్సు చేసి స్వామిని ప్రసన్నం చేసుకొని ఉన్నారు. ఈ క్షేత్రములో రుద్రదేవులు క్షేత్రపాలకుడిగా ఉంటారు.



పరమాత్మ ఉగ్రరూపాన్ని తాళలేక లక్ష్మీదేవి ఈ క్షేత్రంలో పుష్కరణిలో శాంత చిత్తురాలై వేంచేసి ఉన్నది. ఆ కారణంగా ఈ తీర్థానికి "కమలా పుష్కరిణి" అని పేరు. ఇది తపోభూమి కృతయుగంలో నరసింహ స్వామిగా ఈ క్షేత్రంలో దేవతలను, మునీశ్వరులని అందరినీ కటాక్షించారు. త్రేతాయుగంలో సీతారాములు వనవాసానికి వచ్చి ఈ క్షేత్రంలో కూర్చుని ఉన్న కారణంగా ఈ క్షేత్రానికి సీతా నగరము అని కూడా అంటారు. నేటికి బ్రహ్మోత్సవములో ఒకరోజు స్వామివారికి సీతారాములుగా పల్లకి సేవ, ఊంజల్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ద్వాపరయుగములో నర నారాయణులుగా పరమాత్మ ఇక్కడ వేంచేసి ఉన్నారు. ఆ కారణంగా ఈ క్షేత్రానికి దక్షిణ బదరి ఆశ్రమము అని పేరు. మూడు రూపాలుగా పరమాత్మ ఇక్కడ మనకు కనబడతారు యోగానంద లక్ష్మి నరసింహ స్వామిగా, మధ్యలో శంఖచక్ర గదా పద్మముల ధరించి నర నారాయణ స్వరూపాల్లో, జీవాత్మ పరమాత్మను సేవించే దివ్యమూర్తులు ఈ క్షేత్రంలో మాత్రమే మనకు దర్శనమిస్తారు. ఆంజనేయ స్వామి వారు క్షేత్రాన్ని సంరక్షిస్తూ ఉంటారు. అనేక మంది సిద్ధులు ఈ క్షేత్రంలో శిలల రూపంలో ఉండి నేటికీ తపమాచరిస్తూ ఉన్నారు అని అందరి విశ్వాసం. నాగలితో పొలం దున్నుతుండగా స్వామి మూర్తి ప్రత్యక్ష మయిందని, సాక్షాత్ అనంతుడే దారి చూపగా ప్రతిష్ఠించ బడ్డారని స్థల పురాణం ఈవిధంగా వెలసిన శ్రీమన్ నింభాజాల లక్ష్మీనరసింహస్వామి వారు నేటికీ భక్తులకు కొంగు బంగారమై అనుగ్రహం చేస్తున్నారు యుగయుగాల దేవుడు ఈ స్వామివారు. చతుర్ముఖ బ్రహ్మ కరార్చిత శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి చతుర్యుగమూర్తి. కాలాంతరమున ఈ క్షేత్రానికి లింబాద్రిగుట్ట అని పేరు మారి లోకంలో వ్యవహరింపబడుతున్నది. శ్రీస్వామివారికి కార్తీక మాసంలో నవాహ్నికంగా శ్రీ పాంచరాత్ర శాస్త్ర ఆగమోక్తంగా బ్రహ్మోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కార్తీక శుద్ధ సప్తమి మొదలు కార్తీక బహుళ ప్రతిపద వరకు శ్రీవారి బ్రహ్మోత్సవం రథోత్సవము నిర్వహణ చేస్తారు. మహారాష్ట్ర కర్ణాటక తెలంగాణ, తమిళనాడు ఆంధ్రదేశముల నుండి శ్రీ స్వామివారికి విశేషమైన భక్తులు ఉన్నారు.

కంచికి చెందిన శ్రీ వైష్ణవాచార్య పురుషులు వరదాచార్యులు శిష్యులతో, భార్యతో కలిసి ఈక్షేత్రానికి. విచ్చేయగా పుష్కరణి స్నాన మహిమతో, స్వామి దర్శనంతో వారి భార్య ఆండాళమ్మకు దీర్ఘ వ్యాధి నయమయింది. అప్పటినుండి వారు. వారిశిష్యులు తమ కులధనమగు వరదరాజ స్వామిగానే సేవించారు చాలా మంది శ్రీవైష్ణవులకు ఈ స్వామి కుల ధనము. ఇలా ఎన్నో ఆశ్చర్యకరమైనటువంటి లీలలని లక్ష్మీనరసింహస్వామి వారు చేస్తూ తన యొక్క లీలా వినోదాన్ని తన యొక్క మహాత్యాన్ని నేటికీ చూపిస్తున్నారు.

– శ్రీరామ్అగస్త్యన్, నిజామాబాద్

# శ్రీరామానుజ సుధామాధురి



## వాత్సల్యం వరదాయకం

అమృతోపమానమైన మాతృవాత్సల్యం తెలియని వారు ఉండరు. శిశువు అశక్తతకు తాను ఆలంబనగా నిలుస్తుంది. దేహ పోషణను, జీవిత అవసరాన్ని తాను వాత్సల్య మూర్తియై తీర్చుతుంది మాతృదేవత. ఆ శరీరం ధర్మసాధనకు ఉద్దేశింపబడింది! "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అని విజ్ఞులు ఆత్మోజ్జీవన మార్గాన్ని మనకు తెలియ పరిచారు. అటువంటి మార్గాన్ని మనకు ఉపదేశించి ఆవరాన్ని ప్రసాదించగల వారు ఆచార్యులు. వారు మనలోని అయోగ్యతను, దోషాలను లెక్కించక జ్ఞానాన్నుపదేశించే పూర్ణులు. అందుకే సాంప్రదాయ వాంగ్మయ వ్యాఖ్యానాల్లో ఆచార్యులను తల్లిగా అభివర్ణిస్తారు. వాత్సల్యం అంటేనే దోషభోగ్యత్వం అనగా దోషాలను లెక్కించక ఉద్ధరించి అనుగ్రహించటం. వత్స అనగా అప్పుడే జన్మించిన లేగ దూడ. ఆ దూడను గోవు మాతృ ప్రేమతో నోటితో శుభ్రపరుస్తుంది. అటువంటి ప్రేమనే వాత్సల్యం అని పెద్దలు నిర్వచించారు.



శ్రీ భగవద్ రామానుజాచార్యులు కూడా వాత్సల్య గుణపూరితులు! శిష్యుల దోషాలను లెక్కించక కరుణాపూర్ణులై వాత్సల్యంతో అందరినీ తరింప చేశారు. వారి వాత్సల్యం సమకాలీన జనోద్ధరణకు మాత్రమే కాదు. ఆచంద్రతారార్కము, ఆసేతుహిమాచల పర్యంతము విస్తరించింది. సిద్ధాంతోపదేశ సుధలను కురిపించింది. రామానుజ దర్శనం భగవత్ ప్రాప్తి మార్గాన్ని అందరికీ దర్శింప చేసింది. భగవంతునిలోని వాత్సల్య గుణాన్ని అనుభవింప చేసింది. శరణాగతి గద్యలో "అపార కారుణ్య సౌశీల్య వాత్సల్య ఔదార్య ఐశ్వర్య సౌందర్య మహోదధే!" అని ప్రార్థించి పరమాత్మలోని కళ్యాణ గుణాలను తాను దర్శించి తెలియ చేశారు. అందుకే "దయైక సింధోః"అని, "విజ్ఞాపనం యదిద మద్యతు మా మకీనం అంగీకురుష్వ యతిరాజ దయాంబురాశే!" అని మణవాళమామునులు యతి రాజ వింశతిలో స్తుతిస్తారు. యతిరాజుల చరిత్ర వైభవంలో అనేక సన్నివేశాలు వారి వాత్సల్య శీలతను వెల్లడిస్తాయి. వారి ముందు ఎవరైనా తప్పు చేస్తే దానికి అనేక ఒప్పులు చేసే విధంగా వారిని పరివర్తింప చేశారు. అజ్ఞానంతో అవగాహన లోపంతో ఉన్న శిష్యులెందరినో వారి జ్ఞానం వికసింప చేసేలా అనుగ్రహించారు.

జగదాచార్యుల వాత్సల్యానికి తార్కాణమైన రెండు అంశాలను చూద్దాం!. యజ్ఞమూర్తి అను పండిత శ్రేష్ఠుడు మహా విద్వాంసుడు. శాస్త్ర జ్ఞానం తెలిసిన విజ్ఞుడు. కాని పూర్వాశ్రమంలో భగవద్రామానుజాచార్యులతో వారికి 17 రోజులు అనర్గళంగా శాస్త్ర వాదాలు జరిగాయి. 18వ రోజున జగదాచార్యుల దివ్యవర్చస్సును, జ్ఞాన పరిపూర్ణతను చూచి పరవశులై, శిష్యులుగా మారిపోయారు. భగవద్రామానుజాచార్యులు "అరుళాల పెరుమాళ్ ఎంబెరుమానార్" అను దివ్య నామాన్ని అనుగ్రహించి శిష్యులను గావించుకున్నారు. వారు ఆచార్య నిష్ఠతో ఎన్నో సాంప్రదాయ గ్రంథాలను రచించారు.

ప్రపన్న గాయత్రిగా ప్రసిద్ధమైన, యతిరాజుల వైభవాన్ని ప్రకాశింప చేసిన, ఇరామానుజ నూత్తందాది కృతికర్త తిరువరంగత్త ఆముదనార్లు.వీరు శ్రీరంగనాథస్వామి దేవాలయంలో కోయిల్ నంబిగా ఆరాధన ఉత్సవ నిర్వహణ అధికారిగా ఉండేవారు. యతి రాజులు అనేక ఆగమోక్త విధానాలతో శ్రీ రంగనాథ ఆరాధన సేవలను సంస్కరించారు. ఆ సమయంలో తన శిష్యులైన కూరత్తాళ్వాన్ చేత అముదనార్లను దిద్దుబాటు చేయించారు. వారు ఆచార్య నిష్ఠతో యతి రాజులపై ఎంతో భక్తితో, ఆచార్య భక్తి ఫల మాధుర్యాన్ని ,అమృతతుల్యమైన ఇరామానుజనూత్తందాదిగా గానం చేశారు. జగదాచార్యుల అనుగ్రహాన్ని పొంది, అముదనార్ అను దివ్య నామాన్ని స్వీకరించారు.

ఈ విధంగా అనేకమంది పండితులను, జ్ఞానులనే కాదు అతి సామాన్యులైన వారిని, స్త్రీలను, ఆర్తి గల శిష్యులను, పామరులను అందరినీ అనుగ్రహించి తరింప చేశారు. శాశ్వతమైన ఆచార్య పరంపరాగతవ్యవస్థను ఏర్పాటు చేశారు.

## వాత్సల్యం వరదాయకం

వేదవాఙ్మయ సారానికి సిద్ధాంత సూత్ర సారభాలతో నవరత్నాలు (తొమ్మిది గ్రంథాలు) రచించారు. దయావారాశి అయిన యతి రాజుల వాత్సల్య గుణాన్ని మన పెద్దలు ఎంతో గొప్పగా ప్రస్తుతించి నిరూపించారు.

120 సంవత్సరాలు సుదీర్ఘ జీవితం లోకోద్ధరణ కోసమే కృషిచేసిన యతీంద్రులు తిరిగి యతీంద్ర ప్రవణులుగా శ్రీరంగనాథ క్షేత్రమందే అవతరించారు. భగవద్రామానుజా చార్యులే వాత్సల్యంతో వరదాయకులై వరవరమునులుగా సాంప్రదాయ ఉద్ధరణకు అవతరించారు. వీరిని వరవరమునులు, అళగియ మణవాళమామునులు, యతీంద్రప్రవణులు, రమ్యజామాతరం, అని స్తుతిస్తారు. ఎందరో శిష్యులకు అభిమాన పాత్రులైన ఆచార్యులు వీరు. ఆచార్య నిష్ఠ గల అష్టదిగ్గజములు అను పేరుగల శిష్యుల చేత సేవింపబడ్డారు. శ్రీరంగనాథునిచే 'శ్రీశైలేశ దయాపాత్రం' అను తనియతో గురువుగా భావించ బడ్డారు. ఆదిశేషాంశజులైన వీరి చరిత్ర వైభవం పూర్వాచార్యుల వాంగ్మయంలో అద్భుతంగా తెలియజేయబడింది.

ఆళ్వార్ తిరునగరికి, శ్రీరంగ క్షేత్రానికి, దివ్య దేశాలకు, శ్రీరామానుజ దర్శనానికి వీరి వలన పునర్వైభవము కలిగినట్లుగా పెద్దలు చెప్తారు. శ్రీరామానుజ మునులు సాక్షాత్ ఆదిశేషులు అని నిరూపణలు ఉన్నట్టుగానే, మనవాళ మామునులుకూడా శేషాంశజులనుటకు ప్రమాణములు ఉన్నాయి. శఠగోప కొత్తియమ్మ అనే ఆమెకు వీరు ఆదిశేష స్వరూపముతో దర్శనం ఇచ్చారు. శ్రీరంగనాథునికి ఆలపట్ట కైంకర్యం చేసే ఉత్తమ నంబికి శ్రీ రంగనాథ స్వామియే స్వప్నంలో కనిపించి వీరు ఆదిశేషులని చెప్పినట్లుగా చరిత్ర మరియు పెద్దలు పూర్వాచార్యులు "యతీంద్ర ప్రవణ స్సాక్షాత్ యతీంద్రో భాష్యకృత్ ధ్రువం" అని ఈ విధంగా నిరూపించారు. వారు రచించిన అనేక సాంప్రదాయ గ్రంథ వ్యాఖ్యానములు, వారుపదేశించిన శ్రీ సూక్తులు, వారు తెలిపిన శాస్త్రార్థములు శ్రీనమ్మాళ్వార్ల మొదలగు పూర్వాచార్యులను ప్రకాశింప చేసిన విధము, సిద్ధాంత ప్రచారానికి అష్టదిగ్గజాలను (జీయర్లను) ఏర్పాటు చేయుట, దివ్యదేశ అభిమాన దర్శనాదులు, శ్రీరంగ క్షేత్రాన్ని అభివృద్ధి చేయుట, ఇత్యాదులచేత శ్రీమత్ వరవరములు సాక్షాత్ యతిరాజులే అని నిరూపించబడినది. అందుకే "యతివరుల వాత్సల్య ఫలమగు వరమే వరవరమునుల అవతరణము" అని పెద్దల అభిప్రాయము.

## మార్గశీర్షం మార్గళి భక్తి మాధుర్యం

**(6 వ పేజీ తరువాయి)** తదియ రంభా తృతీయ వ్రతం మరియు యోగ తృతీయ,నామ తృతీయ అని అంటారు. చతుర్థి నక్త చతుర్థి అని వినాయక వ్రతం చెప్పబడింది. పంచమి నాడు నాగపూజ. షష్ఠి స్కంధషష్ఠి. సుబ్రహ్మణ్య షష్టిగా సుబ్రహ్మణ్య స్వామి పూజను ఆచరిస్తారు. చాలా ప్రాంతాల్లో వైభవంగా ఉత్సవాలు చేస్తారు. పాలకుండలతో కావడి కట్టి కార్తికేయుడ్ని మొక్కుబడులతో పూజిస్తారు. సప్తమిన భాను సప్తమి, జయసప్తమి, మిత్రసప్తమి అని సూర్య భగవానుని పూజ. అష్టమి కాలభైరవాష్టమి పూజ. శునకాలకు పాలు పెరుగు ఆహారం ఇస్తారు. భైరవపూజ చేస్తారు.ఏకాదశిని మోక్షైకాదశి, వైకుంఠ ఏకాదశి అంటారు.. ఉత్తర ద్వార దర్శనం. ద్వాదశిని మత్స్య ద్వాదశి అని పిలుస్తారు. మార్గశిర శుద్ధ ద్వాదశి తిరుమల పుష్కరిణిలో పవిత్ర తీర్థరాజాలు వచ్చి చేరుతాయని పుష్కరణి పూజలు ఆచరిస్తారు. త్రయోదశి నాడు అనంగ త్రయోదశిని హనుమజ్జయంతిని కూడా ఆచరిస్తారు. మార్గశిర పూర్ణిమ కోరల పూర్ణిమ యమదోష పరిహార పూజ. మరియు ఈరోజు విశేషంగా దత్తాత్రేయ స్వామిని పూజించి దత్త జయంతి పూర్ణిమను జరుపుకుంటారు. దత్తాత్రేయ స్వామిని త్రిమూర్తిశక్తి పూర్ణుడుగా ఉపాసిస్తారు. గురుదత్త స్వామిగా ఆరాధిస్తారు. దత్తాత్రేయ స్వామి మంత్రం గొప్ప ఫలవంతమైనదిగా భావించి భక్తిశ్రద్ధలతో ఉపాసిస్తారు. కృష్ణపక్షమందలి ఏకాదశికి సఫలైకాదశి అని పేరు. మార్గశిర మాసం గురువారాలలో మహా లక్ష్మీ వ్రతం చేస్తారు. మార్గశిర మాసంలో ధనుష్ సంక్రమణం డిసెంబర్ 16,17 తేదీల్లో జరుగుతుంది. ఆనాటి నుండి సూర్యుడు ధనుస్సు యందున్న నెల రోజులు(27 రోజులు) స్నాన వ్రతం చేస్తారు. ప్రధానంగా విష్ణు సంబంధిత దేవాలయాల్లో భగవత్ ప్రీతికరమైన గోదాదేవి విరచిత తిరుప్పావై దివ్య ప్రబంధ అనుసంధాన, కాలక్షేప వ్రత పూజలు వైభవంగా ప్రారంభిస్తారు. శీతల వాతావరణంలో ఆరోగ్యాన్ని, సత్త్వ గుణాన్ని కలిగించే పదార్థాలతో పొంగలిని వండి నివేదన చేస్తారు.మార్గం అంటే భగవదనుగ్రహ ప్రాప్తి మార్గమే! అటువంటి సద్యో మార్గదర్శకం అయిన మార్గశిర మాసం శ్రేష్టమైనది. మార్గళిభక్తి మాధురితో నిండిన మార్గశీర్షం మహోన్నతమైనది.

# శ్రీపతి స్తుతి

## సుభాషితం
### మంచి మాట

**హరినామ స్మరణ చేస్తే చాలు భగవంతుడు కరుణిస్తాడు. ఆ స్మరణ లేక ఎన్ని పుణ్య నదులలో మునిగినా, పవిత్రమైన క్షేత్రాలు సందర్శించినా ఏమీ ఫలితం ఉండదు. అంటే తీర్థాలు, క్షేత్రాలు పుణ్యప్రదములు కావా? వాటిని సేవించుకోవద్దా ? అనుకునేరు సుమ! పొరపాటు! మరి ఏమి అంటే, శ్రీహరి నామస్మరణం చేస్తూ ఉండాలి. అప్పుడు అవన్నీ విశేష పుణ్యప్రదములు అవుతాయి.**

**శ్రియై నమః! శ్రీధరాయ నమః!**


**హర్యష్టకం** రెండవ శ్లోకము:

"సగంగా సగయా సేతుః సకాశీ స చ పుష్కరం
జిహ్వాగ్రే వర్తతే యస్య హరి రిత్యక్షర ద్వయం"

ప్రతిపదార్థము: యస్య=యెవని యొక్క, జిహ్వాగ్రే=నాలుక కొసయందు, హరిః ఇతి= హరి అని అక్షర ద్వయం= అక్షరముల జంట, వర్తతే= ఉంటున్నదో, సః= అతడు, గంగా= గంగా నది' సః= అతడు' గయా= గయా క్షేత్రము, సేతుః= సముద్రంపై వానరసేన నిర్మించిన వారధి, సః= అతడు,కాశీ= కాశీక్షేత్రము, సః= అతడు, పుష్కరం చ= పుష్కర క్షేత్రం కూడా.

హరి నామ మహాత్మ్యం ఉచ్చరించే వారి యొక్క గొప్పతనం ఈ శ్లోకంలో చెపుతున్నారు. సారాంశం ఏమిటంటే ఎల్లప్పుడూ హరినామ స్మరణ చేస్తే చాలు భగవంతుడు కరుణిస్తాడు. ఆ స్మరణ లేక ఎన్ని పుణ్య నదులలో మునిగినా, పవిత్రమైన క్షేత్రాలు సందర్శించినా ఏమీ ఫలితం ఉండదు. అంటే తీర్థాలు, క్షేత్రాలు పుణ్యప్రదములు కావా? వాటిని సేవించుకోవద్దా? అనుకునేరు సుమ! పొరపాటు! మరి ఏమి అంటే, శ్రీహరి నామస్మరణం చేస్తూ ఉండాలి. అప్పుడు అవన్నీ విశేష పుణ్యప్రదములు అవుతాయి.

పవిత్రమైన నదులలో మొదటగా పేర్కొనబడే నది గంగానది. ఆ నది స్వర్గ, మధ్య, పాతాళమనే మూడు లోకాలలో ప్రవహిస్తూ అందరిని తరింప చేస్తున్నది. సాక్షాత్తు శ్రీహరి పాదం నుండి బయలుదేరింది. విష్ణుపాదోద్భవి గంగా అని గంగానదిని గురించి మనసులో తలచినా నోట పలికినా చాలు. "గంగా గంగేతి యో బ్రూయాత్ కల్పకోటి శతై రపి" అంటే కోటి జన్మల పాపం కూడా 'గంగా' అంటే పోతుంది. కాబట్టే మన పూర్వీకులు 'గంగాలయం' అనే పేరుతో ఇత్తడి పెద్ద పాత్ర తయారు చేసుకొని అందులో నీరు నింపి ఇంటి ముందు పెట్టేవారు. ఎవరైనా ఇంటికి వస్తే మొదట కాళ్లు కడుక్కునే అలవాటు ఉండేది. ఆ తర్వాత స్నానానికి నీళ్లు అందులోనే ఏర్పాటు చేసేవారు. గంగాలయం అనేది గంగాళంగా మారిపోయింది. గంగా స్నానం పుణ్య ప్రదమైనది. సః గయా-అతడే గయాక్షేత్రం అంటున్నారు. అంటే గయా క్షేత్రం భారత దేశంలో పితృ ముక్తి ప్రద మైనది.మనం ఇంటిలో పితృదేవతల నర్చించినా, పిండప్రదానం చేసినా "గయాయాం. దత్తమస్తు" గయలో ఇచ్చినట్లు అగుగాక - "ఇదం శ్రాద్ధం గయా శ్రాద్ధ ఫలదమస్తు" అని 'గయేయం' అని మూడు మార్లు చెప్పి ఉత్తరం వైపు నువ్వులు చల్లి "ఫల్గునీ తీర్థం గయా శ్రాద్ధం ఇదమస్తు తిలోదకం" అంటారు. గయా క్షేత్రం దగ్గర ఫల్గుణీ నది ప్రవహిస్తుంటుంది. మనం జీవితంలో ఒక్కసారయినా గయకు వెళ్ళి పిండ ప్రదానం తప్పక చేయాలి. మరణించిన తల్లిదండ్రులకు అక్కడ పిండ ప్రదానం జరిపించుట వలన పుత్రుడుగా జన్మించిన ప్రయోజనం ఉంటుంది. లేనిచో పుత్రుడు కాడు అని శాస్త్రం. ఇంకా ఎన్నో విషయాలు గయను గురించి తెలుసుకోవలసినవి ఉన్నాయి.




శ్రీమాన్ అమరవాది వేంకటనరసింహా చార్యులు

**మరికొన్ని మంచి విషయాలు వచ్చే సంచికలో...**

# తిరుప్పావైలో దివ్యదేశ ప్రస్తుతి

పండితరత్న వేదన్తవాచస్పతి శ్రీ ఉ.వే.శ్రీమాన్ డాక్టర్ ఈ.ఏ.శింగరాచార్యస్వామి



భగవంతుడైన శ్రీమన్నారాయణుడు జగత్తులో అంతటా వ్యాపించి ఉండేవాడైనా, భక్తుల ఆరాధనా సౌకర్యం కోసం పరం, వ్యూహం, విభవం, అంతర్యామి, అర్చ అని ఐదు విధాలుగా ఉండే రూపాలను కలిగి ఉంటాడని పాంచరాత్రాది శాస్త్రాలు చెబుతున్నాయి. పరం అనేది వైకుంఠంలోని రూపం. వ్యూహం అనేది పాలకడలిలోని రూపం, విభవం అనేది ఆయా అవతారాలలోని రూపం, అంతర్యామి అనేది ప్రతి జీవి హృదయంలో ఉండే రూపం, ఇక, అర్చ అనే ఐదవ రూపం దివ్యదేశాలలో, మందిరాలలో, గృహాలలో నెలకొని ఉండే రూపం. ఈ ఐదింటిలో అర్చ అనే రూపంలో భగవంతుని పరత్వం, సౌలభ్యం అనే రెండు అసాధారణ లక్షణాలు పరిపూర్ణంగా ఉన్నందున, దీనిని ఉపనిషత్తులు పూర్ణశబ్దంతో కీర్తించాయి. దివ్యసూరులు అనబడే ఆళ్వారులు కూడా తమ దివ్యప్రబంధాలలో మాటిమాటికి ఈ ఐదు రూపాలను కీర్తించినప్పటికీ, అర్చారూపానికే ప్రాధాన్యాన్ని ఇచ్చారు. గోదాదేవి కూడా తాము అనుగ్రహించిన తిరుప్పావై ప్రబంధంలో మొదటి పాశురంలో పరరూపాన్ని, రెండవ పాశురంలో వ్యూహ రూపాన్ని, మూడవ పాశురంలో విభవ రూపాన్ని, నాల్గవ పాశురంలో అంతర్యామి రూపాన్ని, అయిదవ పాశురంలో అర్చారూపాన్ని ప్రస్తుతించినప్పటికీ, అర్చారూపాన్ని ఆ ప్రబంధంలోని 30 పాశురాలలోనూ ప్రస్తావించారు అని అభిజ్ఞులైన పెద్దల అభిప్రాయం. పాశురాలలో ప్రయోగించిన ఆయా పదసందర్భాలను బట్టి ఈ విధంగా చెప్పే అవకాశం ఉన్నదని కూడా వారు వివరించారు. ఈ అంశాన్ని సంగ్రహంగా గమనిద్దాం.

ద్రావిడ భాషలో "కోయిల్" అనే పదానికి అర్చామూర్తి వేంచేసి ఉండే దేవాలయం అనిఅర్థం. ఇదే తెలుగులో కోవెల అయినది. గోదాదేవి ఈపదప్రయోగాన్ని తిరుప్పావై ప్రబంధంలో పలు పాశురాలలో చేయడం గమనించవచ్చు. ఆరవ పాశురంలో "పుళ్ళరైయిన్ కోయిలిల్" అని, 14వ పాశురంలో "తంగళ్ తిరుక్కోయిల్" అని, 16వ పాశురంలో "కోయిల్ కాప్పానే" అని, 23వ పాశురంలో " నిన్ కోయిల్ నిన్ఱు" అని, 26వ పాశురంలో "నిన్ కోయిల్ నిన్ఱు ఇంగనే పోందరుళి" అని ఈవిధంగా పలు పర్యాయాలు ఈ పదప్రయోగం చేయబడడం కనిపిస్తుంది. ఇవి అన్నీ భగవంతుని ఆలయాలు అనే అర్థంలోనే ప్రయోగింపబడ్డాయి. ఇవి, ఈ ప్రబంధంలోని, సాధారణంగా మనకు దేవాలయం ప్రశస్తిని సూచించే ప్రయోగాలు. ఇంతే కాకుండా, ప్రతిపాశురం లోనూ గోదాదేవి చేసిన పద ప్రయోగాల సామర్థ్యం వల్ల కొన్ని దివ్యక్షేత్రాలు ప్రస్తావింపబడ్డాయి అని చెప్పవచ్చు. ఈ విషయంగా నాలుగైదు ఉదాహరణలను మాత్రం గమనిద్దాం.

## తిరుక్కోవలూర్ క్షేత్రం

"ఓంగి ఉలగు అళంద" అనే మూడవ పాశురంలో త్రివిక్రమావతార వైభవం ప్రస్తావింపబడింది. భగవంతుడు త్రివిక్రమరూపంలో చాలా క్షేత్రాలలో దర్శనం ఇస్తున్నప్పటికీ ,



వాటిలో తిరుక్కోవలూర్ అనే క్షేత్రాన్నే ప్రధానమైనదిగా పరిగణిస్తారు. అందుచేత ఈ పాశురంలో ఆ క్షేత్రప్రస్తావన ఉన్నదని భావించవచ్చు.

## తిరువనంతపురం అనంతపద్మనాభక్షేత్రం

"ఆళి మళై క్కణ్ణా" అని ఆరంభం అవుతున్న నాలుగవ పాశురంలో "పాళియమ్ తోళుడై పఱ్పనాబన్'' (బలిష్ఠమైన, అందమైన పావులను గల పద్మనాభుడు అనే ప్రయోగం



ఉన్నందున, అనంత పద్మనాభుడు ఇక్కడ ప్రస్తావింపబడ్డాడు అని చెప్పవచ్చు. అనంతపద్మనాభుని రూపంలో భగవంతుడు నెలకొని ఉండే క్షేత్రం కేరళ దేశంలోని తిరువనంతపురం అనే అనంతపద్మనాభక్షేత్రం కనుక, ఈ పాశురంలో ఈ క్షేత్రప్రస్తావన చేయబడిందని భావించే అవకాశం ఉన్నది.

# తిరుప్పావైలో దివ్యదేశప్రస్తుతి

## శ్రీరంగక్షేత్ర

21వ పాశురంలో "నిన్ కోయిల్ నిన్రు ఇంగనే పోందరుళి" ( నీ ఆలయం నుండి ఈ విధంగా వేంచేసి) అనే ప్రయోగం ఉన్నందున ఈ పాశురంలో శ్రీరంగక్షేత్ర ప్రస్తావన చేయబడింది అని చెప్పవచ్చు. ఈ పాశురంలోనే కాక, మిగతా కొన్ని పాశురాలలో కోయిల్ అనే పదప్రయోగం చేయబడినప్పటికీ, ఈ పాశురంలో శ్రీకృష్ణుని గమన సౌందర్యం విశేషించి ప్రస్తావన చేయబడడం చేత, శ్రీరంగంలో శ్రీరంగనాథుని "నడైయళకు" అనబడే గమనసౌందర్యం ప్రసిద్ధం కనుక, ఇందులో శ్రీరంగ ప్రస్తావన చేయబడిందని భావించే అవకాశం ఉన్నది.



## శ్రీవిల్లి పుత్తూరు క్షేత్రం

26వపాశురంలో "ఆలినిలైయాయ్" అని అంటూ వటపత్రశాయి ప్రస్తావన చేయబడింది. శ్రీవైష్ణవ దివ్యక్షేత్రాలలో వటపత్ర శాయి రూపంలో భగవంతుడు నెలకొని ఉండే క్షేత్రం శ్రీవిల్లి పుత్తూరు అనే క్షేత్రం. అందుచేత, ఈ పాశురంలో శ్రీవిల్లి పుత్తూర్ క్షేత్రప్రస్తావన ఉన్నదని భావించవచ్చు.


## తిరువేంగడం (తిరుమల క్షేత్రం)

కూడారై వెల్లుమ్" అనే 27 వ పాశురంలో తిరువేంగడం అనే శ్రీవేంకటాచల ప్రశస్తి భావించదగినది. ఇందులో మొదటి పాదాన్ని చివరి పాదాన్ని ప్రధానంగా గ్రహించాలి. మొదటి పాదంలో విరోధి నిరసనం, చివరి పాదంలో అందరూ కలిసి ఆనందించిన విధానం చెప్పబడ్డాయి. శ్రీరామానుజులు శ్రీవేంకటేశ్వరుని విషయంలో ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించి, విరోధి నిరసనాన్ని చేసిన చరిత్ర ప్రసిద్ధం. ఇక, చివరి పాశురంలో ఉండే "కూడి ఇరుందు" అనే ప్రయోగం ఈ కొండపై నిత్యకైంకర్యాన్ని చేయాలని నమ్మాళ్వారులు ఆశపడిన విషయాన్ని సూచిస్తున్నది. ఆ విధంగానే, ఈ పాశురంలోని "కుళిర్ న్దు" అనే ప్రయోగం కూడా " "కుళిరరువి వేంగడమ్ " (చల్లని కొండవాగులను కల వేంకటాచలం) అని మొదలైన దివ్యసూరుల ప్రయోగాలను స్మరింప చేస్తుంది. అందుచేత, ఇందులో వేంకటాద్రి క్షేత్రప్రస్తావన చేయబడిందని భావించవచ్చు. ఈ విధంగానే తిరుప్పావై ప్రబంధంలోని మిగిలిన పాశురాలలో కూడా పలు దివ్యదేశాల ప్రశస్తి మనకు గోచరిస్తుంది. -స్వస్తి



## డాక్టర్ గోవర్ధనం సుందర వరదాచార్యులకు శ్రీసన్నిధానం అంజలి ఘటిస్తోంది

సునిశిత మేధావి, సుప్రసిద్ధ విద్యావేత్త, సంపాదకులు, పరమ ప్రపన్నులు, పాత్రికేయ విద్యలో ఆచార్యులు, ప్రముఖ జర్నలిస్ట్ శ్రీమాన్ శ్రీ గోవర్ధనం సుందర వరదాచార్యులు పరమపద వాసులయినారు. ఆచార్య తిరువడి యందు వేంచేసిన వారికి శ్రీ సన్నిధానం మాసపత్రిక అంజలి సమర్పించుకుంటున్నది. సమాజ హితాన్ని కాంక్షించి జర్నలిజంలో విప్లవాత్మక మార్పులకు దోహదం చేశారు. శ్రీ వైష్ణవ లోకంలో ఆధ్యాత్మిక రంగంలో ఒక మంచి మార్పు తేవాలని ఆ రోజుల్లోనే "వైష్ణవ" అనే మాస పత్రికను ప్రారంభించారు. వృత్తిలో, ప్రవృత్తిలో శ్రీవైష్ణవానికి పెద్దపీట వేస్తూనే ఇటు తాను నిర్వహించిన, పనిచేసిన పత్రికల్లో పెద్ద జీయర్ స్వామి వారు సమాజ హితానికి చేస్తున్న సేవలను పతాక శీర్షికలో వార్తలు వచ్చేలా చేశారు. వారు విద్యా,రాజకీయ సినీ రంగాలకు కూడా విశిష్ట సేవలను అందించారు. వారి సంపాదకీయాల్లోనే చక్కని మార్పు కలిగించే భావజాలాన్ని వ్యక్తీకరించారు. సామాజిక మార్పును కోరుకొని వారి కలం ద్వారా, వారి ప్రాచార్య బోధనల ద్వారా, జర్నలిజాన్ని సమాజహితం కొరకు అందించారు. వారు



పరంపరగా శ్రీనమ్మాళ్వారుల అధ్యయన ఉత్సవాలు శ్రీరామానుజాచార్యుల ఆరాధన ఉత్సవాలు జరిపే జన్మానుష్ఠానములు కలిగిన సాంప్రదాయానుసరణము కలిగిన వంశంలో జన్మించడం మరింత గొప్ప విశేషం. శ్రీసన్నిధానం సంచికలను చూసి వారు సంతసించారు.

శ్రీమాన్ శ్రీ గోవర్ధనం సుందర వరదాచార్యులకు శ్రీసన్నిధానం మాసపత్రిక అంజలి ఘటిస్తున్నది.

# వైభవంగా శ్వాస్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

**రెండు సంవత్సరాల శ్వాస్ ప్రగతి తెరిచిన పుస్తకం. సూర్యాపేట వేదికగా. హంగులు ఆర్భాటాలు అసలు లేనేలేవు. ఆచార్య మంగళాశాసనాలతో వేడుకలు. ప్రతిక్షణం కార్యదక్షత అకుంఠిత దీక్ష. దశ దిశలా రామానుజ సైనికులను తయారు చేస్తోంది శ్వాస్. ప్రతి పలుకులో నిజాయితీ, ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళుతోంది. వెనక్కుతిరిగి చూస్తే.... అప్పుడే రెండేళ్లు అయ్యాయా అనిపిస్తోంది. శ్రీశ్రీశ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయరు స్వామి వారు చిటికెన వేలు పట్టుకుని శ్వాస్‌ను నడిపించారు. సాంప్రదాయం అనే ఉగ్గుపాలు పోసి ముగ్గురు జీయర్‌స్వాముల అండదండలు అందించారు. తప్పటడుగులు వేయకుండా తత్తర పాటు పడకుండా ముచ్చింతల ఆశ్రమం నీడనిచ్చింది. వెన్నుదన్నుగా నిలిచించింది. మహా మహోపాధ్యాయ శ్రీ ఉ.వే. శ్రీమాన్ సముద్రాల వేంకట రంగ రామానుజాచార్య స్వామి వారి మార్గదర్శకత్వంలో విద్యాబుద్ధులు నేర్పించి వైదిక సభలు నిర్వహించే సామర్థ్యానికి తీసుకువచ్చారు. అడుగులో అడుగువేసి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని ప్రతి శ్రీవైష్ణవ కుటుంబానికి చేరువకావడానికి అహర్నిషలు శ్వాస్ శ్రమించింది. జీయరు స్వాముల ఆశీస్సులు వారి ప్రతి పనికి బలంగా నిలిచాయి. ప్రత్యక్షంగా పరోక్షంగా శ్రమించే కుటుంబాలు వెన్నుదన్నుగా నిలిచాయి. ఒక్కమాటలో చెప్పాలంటే బలమైన శక్తిగా శ్రీవైష్ణవ ఆగమ సేవాసమితి రూపుదిద్దుకుంది.**

శ్వాస్ - ద్వితీయ వార్షికోత్సవాలు సూర్యాపేట వేదికగా వైభవంగా జరిగాయి. నవంబర్ 17,18 తేదీలలో జరిగిన ఈ వార్షికోత్సవాలను సూర్యాపేట, రవిమహల్ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన భాగవతోత్తములకు ఘనంగా శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల వేణు గోపాలాచార్య స్వామి వారి సౌజన్యంతో ఏర్పాట్లు చేశారు.

శ్రీమద్వేదమార్గ ప్రతిష్ఠాపనా చార్యులు. శ్రీమత్ పరమహంస పరివ్రాజకా చార్యులు, జగదాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారి మంగళాశాసనములతో, ప్రత్యక్ష పర్యవేక్షణలో, మహా మహోపాధ్యాయ శ్రీ ఉ.వే. శ్రీమాన్ సముద్రాల వేంకట రంగ రామానుజాచార్య స్వామి వారి అధ్యక్షతన గురువారం 17న సమావేశాలు ప్రారంభం అయ్యాయి. శ్రీశ్రీశ్రీ దేవనాథజీయరు స్వామి, శ్రీమాన్ సముద్రాల వేంకట రంగ రామానుజాచార్య స్వామి, రాష్ట్రప్రభుత్వ పాంచరాత్రగమ సలహాదారు, భద్రాచల దేవస్థానం స్థానాచార్యులు శ్రీమాన్ స్థలశాయి స్వామి, తదితరుల ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి సభలను ప్రారంభించారు.



కార్యదర్శి నివేదికను వెల్లడిస్తున్న పీతాంబరం వేంకటకిశోర్, నిర్వహణ కీలక బాధ్యతను నిర్వర్తించిన మంగళగిరి యాదగిరి స్వామి

శ్వాస్ వార్షికోత్సవ కార్యక్రమాల పరిచయం వేద పఠనం అనంతరం మొదటి ప్రవచనం భద్రాచలం స్థానాచార్యులు శ్రీ ఉ.వే. శ్రీమాన్ కె.ఇ. స్థలశాయి స్వామి వారు ఉత్తరకాండ శ్రీ రామాయణంలోని భాగమా? దాని విశిష్టతపై ప్రవచనం చేశారు, టి.కె. చూడామణి గారు ఆరాయిరప్పడి వైభవం, తిరువాయుమొజి అవగాహనలో దాని ఉపయోగంపై ప్రవచనం చేశారు. అనంతరం టీటీడీ ఆగమ పాఠశాల అధ్యాపకులు శ్రీమాన్ పాల్వన్చ తిరుమల గుదిమెళ్ళ భరత శేఖరాచార్యస్వామి సుదర్శన వైభవంపై ప్రవచనం చేశారు

సాయంకాలం శ్రీ ఉ.వే. శ్రీమాన్ ఈ.ఎ. శింగరాచార్యస్వామి వారు తిరుపతి, వేంకటాచలం, శ్రీరామానుజ సంబంధంపై ప్రవచనం చేశారు. అరణ్యకాండ వైశిష్ట్యంపై విదుషీమణి కె.వి. జానకమ్మ గారు, శ్రీ కూర్మం క్షేత్ర

# శ్రీమాన్ సముద్రాల వేంకట రంగ రామానుజాచార్య స్వామి వారి సమన్వయం



మహా మహోపాధ్యాయ శ్రీ ఉ.వే. శ్రీమాన్ సముద్రాల వేంకట రంగ రామానుజాచార్య స్వామి వారి పర్య వేక్షణలో, అధ్యక్షతన శ్వాస్ గోష్ఠిని, ఉభయ వేదాంత సభను రక్తికట్టించారు. వారి పలుకులు ఆణి ముత్యాలు. ప్రవచనకారులు సరికొత్త విషయాన్ని వినూత్నంగా ఆవిష్కరించినప్పుడు వారు ఆ అర్థాన్ని సామాన్యులకు సైతం అర్థం అయ్యేలా విడమరచి చెప్పారు. అన్నీ సందర్భోచితంగా చెప్పినప్పుడు వాటి భావస్ఫూర్తి గుండెలోతుల్లోకి వెళ్లి మనను ఉత్తేజితులను చేసింది. సభాకార్యక్రమాల సమయపాలన వారి సూచనల మేరకు కొనసాగింది. ప్రవచన అనుగ్రహ భాషణలను ఆయా విషయాంశాల వివరణలతో అనుసంధానం వారు గావించారు.

➪నడుస్తున్న విజ్ఞానఖనిలా, సంప్రదాయనిధిలా శ్రీమాన్ సముద్రాల వేంకట రంగ రామానుజా చార్య స్వామి వారు అనేక విషయాలు ఆవిష్కరించారు. ఒక్కో సందర్భంలో విషయ ప్రస్తావన పరంపర ఇలా విశ్లేషణాత్మకంగా ఉంది.

➪మరొక సంవత్సరం కూడా ఇలాంటి సభలు జరుపవచ్చును అని ఈ యువకుల మనసుల్లో ప్రోది అగునట్టుగా ఈ సభా నిర్వహణ సాగాలి. ఆవిధంగా చేసే సమర్థులే ప్రవచించటానికి వస్తున్నారు. అంటూ ఉత్సాహాన్ని నింపారు.

➪ఆళ్వార్ శ్రీసూక్తులలోని సారాన్ని భగవద్రామానుజ దర్శనం ఏవిధంగా ఆవిష్కరించింది అనగా భగవత్తత్వాన్ని గురించి అనేక మంది అనేక మార్గాల్లో చెప్పారు. కాని లక్ష్యం ఒకటే కాని మార్గాలు ఎన్నో.. ఆ లక్ష్యాన్ని చేరే మార్గాలలో భగవద్రామానుజ మార్గం, వైదిక మార్గం. ఆకాశాత్ పతితం తోయం సాగరం ప్రతిగచ్ఛతి సర్వదేవ నమస్కారః కేశవం ప్రతి గచ్ఛతి అన్నట్టు మూలతత్వం శ్రీమన్నారాయణుడే! శరీరానికి అవయవాలు ఎలాగో పరమాత్మకు జగత్తు అంతే. ఒక మామిడి పండు, రసము, రంగు, రుచి, టెంక, తొక్క అన్నీ విడివిడిగా ఉన్ననూ ఒక్కటే మామిడి పండు అనబడుతుంది.

➪మరో సందర్భంలో ఉత్సవం, బ్రహ్మోత్సవానికి కూడా చక్కని అర్థాలను స్ఫురణకు తెచ్చారు. హృదయంలోని ఆనందం మరొకరితో పంచుకుంటే ఉత్సవం. అని తెల్పుతూ పురాణ కథాంశాన్ని వివరించారు. బ్రహ్మహృదయం ఆనందంతో పొంగి నృత్యం చేసి పరమాత్మకు ఏర్పాటు చేసిన వాహనోత్సవాలే బ్రహ్మోత్సవాలు అని వివరించారు.

➪సంస్కృత భాషలో మాట్లాడగలిగే వారు కావాలి. ఆగమంలో శాస్త్రం గురించి మాట్లాడ గలిగే వారు కావాలి. పాంచరాత్రాగమంలోనే పరమాత్మతత్వం గురించి వివరించబడింది. అదే రామానుజ దర్శనం అని చెప్పినప్పుడు ప్రవచనకర్తలు సైతం కరతాళధ్వనులు చేశారు.

➪భగవంతుని యొక్క క్రియారూపం, భగవంతుని యొక్కమనసే సుదర్శనపెరుమాళ్ళు. సుదర్శన చక్ర రూపమయిన చిత్రాన్ని నిత్యము చూడాలి. సుదర్శనమే భగవంతుని సంకల్పము.

## శ్వాస్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

అనువంశిక అర్చకులు శ్రీమాన్ గోపినంబాళ నల్లకూర్మన్న గారు (దాసుబాబు), ఆలయ నిర్మాణ ప్రక్రియా వైభవంపై ప్రసంగించారు.

రెండవ రోజు శుక్రవారం భగవద్రామానుజులకు పూర్వం శ్రీవైష్ణవం ఉందా? ఎలా ఉంది? వరంగల్ శ్రీ ఉ.వే. శ్రీమాన్ సముద్రాల శఠకోపాచార్యస్వామి వారు ప్రవచనం చేశారు. భగవద్విషయ ప్రవేశం - భగవద్రామానుజ దర్శన నిరూపణం నరసాపురం శ్రీ ఉ.వే శ్రీమాన్ వంగల వేంకటాచార్య స్వామి వారు ప్రవచనం చేశారు. శ్రీప్రశ్న సంహిత-మహోత్సవ నిరూపణ ప్రక్రియ - విశిష్టత - జీయర్ గురుకుల పాఠశాల ఆగమ ప్రధాన అధ్యాపకులు శ్రీమాన్ ముడుంబై మధుసూధనాచార్య స్వామి వారు ప్రవచనం చేశారు.

ప్రతిరోజు ఆద్యంతం ప్రవచనామృతధార గ్రోలిన వారంతా మధురానుభూతికి లోనయ్యారు. గోష్ఠికి ముందు ➪

# శ్వాస్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

శ్వాస్ నిర్వాహక సభ్యులు తమ కార్యాచరణను, ఆరోజు కార్యక్రమాలను సోదాహరణంగా వివరించారు. అంతే కాకుండా ప్రవచనామృతం అందించి పెద్దలను సభ ముగింపునకు ముందే సన్మానించారు. అంతేకాకుండా గోష్ఠికి విచ్చేసిన విశిష్ట అతిథులను సన్మానించడం, వారిని వేదికపైకి ఆహ్వానించడం ప్రత్యేక ఆకర్షణ.

శ్వాస్ సభల నిర్వహణ తీరును జీయరు స్వాములు పర్యవేక్షించడం ప్రత్యేకత. మొదటి రోజు శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ జీయరు స్వామి వారు ప్రవచనం చేసి విశిష్ట అతిథులకు మంగళాశాసనాలు అనుగ్రహించారు. శ్వాస్ సభ్యులను, కీలక భూమిక నిర్వహిస్తున్న వారిని పేరు పేరునా పలకరించారు.

శ్వాస్ సభల ఏర్పాట్లు చాలా ఘనంగా జరిగాయి. రెండు రోజులు సమావేశాలలో పాల్గొనడానికి వచ్చిన ఉభయ తెలుగు రాష్ట్రాల శ్రీవైష్ణవులకు, భాగవతోత్తములకు అసౌకర్యం జరుగకుండా శ్వాస్ సభ్యులు ఏర్పాట్లు చేసారు. ఇక్కడకు వచ్చిన వారు మనకు తెలుసా లేదా అన్న ప్రశ్న తలెత్తలేదు. అందరినీ పేరు పేరుతో పలకరిస్తూ పెండ్లికి వచ్చిన వరుని తరఫువారికి ఇచ్చిన మర్యాద ప్రతి అతిథికి లభించడం గమనార్హం. వారి నిర్వహణ శ్వాస్ సభ్యుల క్రమశిక్షణకు అద్దపడుతుంది. క్రమశిక్షణ విషయంలో శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవాసమితి (శ్వాస్) అధ్యక్షులు మంగళగిరి యాదగిరి స్వామి, ప్రధాన కార్యదర్శి పీతాంబరం వేంకటకిశోర్‌లు కీలక భూమిక నిర్వహించారు.

ఆళ్వార్ (కోర్) కమిటీ, సంప్రదాయ కమిటీ, ఆగమ కమిటీ, ప్రచార కమిటీ, భాగ్యనగరం జోన్1, 2, ఇతర జిల్లాల సమన్వయ కర్తలు శాఖలు కార్యక్రమం విజయవంతం చేశాయి.

అయితే శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవాసమితి (శ్వాస్) ప్రకటించిన వివిధ కార్యవర్గ జాబితా ఈ క్రింది విధంగా ఉన్నాయి. ★



## దేవనాథ జీయర్ స్వామి మంగళాశాసనాలు

సమాజానికి అవసరమైన సంప్రదాయాలను, సేవలను అందిస్తూ సంప్రదాయ వాఙ్మయాన్ని అందించటానికి ఉభయ వేదాంత సభను కూడా ఏర్పాటు చేసినందుకు మంగళాశాసనం చేశారు. శాస్త్రమంటే భగవంతుని విశ్వాసమే. ఆ జ్ఞానము భగవంతుడు బ్రహ్మకు, ఆయన వేదవ్యాస మహర్షికి, వేదవ్యాసుని ద్వారా లోకానికి అందజేయబడింది. ఇతిహాస పురాణాలు భగవంతుని అవతారాలను తెలియజేస్తాయి. భగవంతుని మనం అర్చా రూపంలోనే దర్శించాలి. అందరూ అర్చించడానికి, ఆరాధించటానికి విధివిధానాలను ఏర్పాటు చేసినవి ఆగమాలు. శ్రీ వైష్ణవ ఆగమాలు పాంచరాత్ర, వైఖానస అని రెండు రకాలు. నూతనంగా నిర్మించబడుతున్న దేవాలయాల్లో ఆగమ సిద్ధంగా ఆరాధనలు సాగాలి. అని సమాజ హితాన్ని కలిగించే ఆలయ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి శ్రీ చిన్న జీయర్ స్వామివారి మంగళాశాసనాలతో శ్వాస్ ఆవిర్భవించింది అంటూ అనుగ్రహ భాషణం చేసి మంగళాశాసనం చేశారు.




శ్రీమాన్ కందాళై రమణాచార్య, శోభ గారు నిర్వహిస్తున్న శ్రీవైష్ణవ కళ్యాణ వేదికను శ్వాస్ గుర్తించి వారి సేవలను ప్రశంసించి సన్మానించింది.



# శ్వాస్ కమిటీలు - సభ్యులు

**ఆళ్వార్ (కోర్) కమిటీ:** మంగళగిరి యాదగిరి స్వామి, పీతాంబరం వేంకట కిషోర్, సౌమిత్రి శ్రీధరాచార్యులు (వాసుస్వామి), కందాడై వరదాచార్యులు (సంగారెడ్డి), గోవర్ధనం వెంకటరమణాచార్యులు గొడవర్తి సంపత్కుమార అప్పలాచార్యులు, గోవర్ధనం నరసింహాచార్యులు, చక్రవర్తుల సుధన్వాచార్యులు, పాడిచేటి రామకృష్ణమాచార్యులు, శృంగారం ఆచార్య ఆత్రేయ, దెబ్బెట శ్రీనివాసాచార్యులు, కొండపాక ప్రదీప్ కుమార్

**సంప్రదాయ కమిటీ:** ముడుంబై రంగనాథ్ మాడభూషి కృష్ణకిరణ్ నరసింహ దేశికన్

**ఆగమ కమిటీ కోటి:** శ్రీమన్నారాయణాచార్యులు కండ్లకుంట వరప్రసాద్ ఆచార్యులు

**ప్రచార కమిటీ:** ముడుంబై శేషగిరి ఆచార్య నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు ముడుంబై విజయకుమార్ ఆచార్య

**భాగ్యనగరం జోన్1:** సమన్వయకర్తలు మోటుపల్లి రామాచార్యులు కొదుమగుళ్ళ వంశీకుమార్

**భాగ్యనగరం జోన్2:** సమన్వయకర్తలు వక్కలంక రఘునందన్ నేరెళ్ళ అభినయ్కుమార్

**ఉమ్మడి పాలమూరు జిల్లా సమన్వయ కర్తలు:** బోరవిల్లి పవన్కుమార్ అర్చకం శ్రీకాంతాచార్యులు

**ఖమ్మం జిల్లా సమన్వయ కర్తలు:** శ్రీరాయపురం రామకృష్ణ ముడుంబై రవికిరణాచార్యులు నల్లాన్ చక్రవర్తుల ఆదిత్య

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమన్వయ కర్తలు:** ఎస్.టి.పి. రఘునాథ్ ఆరుట్ల లక్ష్మణాచార్యులు చక్రవర్తుల రఘుపుంగవ

**ఉమ్మడి ఇందూరు జిల్లా సమన్వయ కర్తలు:** మల్యాల హరిబాబుస్వామి కందాడ గోపాలాచార్యులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా సమన్వయ కర్తలు:** ఇరంగంటి రవి పంచాంగం శ్రీధరాచార్యులు (చైతన్య)

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమన్వయ కర్తలు:** డింగరి కృష్ణచైతన్య చిమిర్యాల శ్రీనివాసాచార్య

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమన్వయ కర్తలు:** ఆచ్చి రామకృష్ణమాచార్య పీచర శ్రవణకుమారాచార్య









ఆచార్య అనుగ్రహంతో శ్వాస్ ద్వితీయ వార్షికోత్సవాలు విజయవంతంగా జరగడానికి సంపూర్ణ సహకారం అందించిన శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు (సూర్యాపేట వేణు స్వామి), జగదాచార్యులు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి శ్రీహస్తాల మీదుగా అభినందన పత్రం అందుకున్నారు. శ్రీ శ్రీ శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారి శ్రీహస్తాల మీదుగా శ్వాస్ - 2022 ఉత్తమ సేవా పురస్కారం ముగ్గురు సోదరులు అందుకున్నారు. శ్రీమాన్ సౌమిత్రి శ్రీధరాచార్యులు (నాగోల్ వాసు), హైదరాబాద్, శ్రీమాన్ గోవర్ధనం వెంకట రమణాచార్యులు, ఆర్మూర్, శ్రీమాన్ చక్రవర్తుల సుధన్వాచార్య స్వామి, హైదరాబాద్





# శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవాసమితి (శ్వాస్) కార్యదర్శి నివేదిక



శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవాసమితి (శ్వాస్) చేస్తున్న సేవలను కార్యదర్శి నివేదికను పీతాంబరం వేంకటకిశోర్ రెండవరోజు సాయంకాలం జరిగిన సభలో సోదాహరణంగా వివరించారు. 2020 సంవత్సరంలో, 20 మంది యువకులతో ఆరంభమైన మన శ్వాస్ రెండు సంవత్సరాలలో సుమారుగా 800 మంది సభ్యులతో విస్తరించిందని ఆయన తన నివేదికలో వివరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా వివిధ ప్రాంతాల శ్రీవైష్ణవులు శ్వాస్ సభ్యులుగా చేరారని, ఇప్పటివరకు ఆనేక సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని , శ్వాస్ సభ్యులను వివిధ కార్యక్రమాలలో భాగస్వాములుగా చేస్తున్నామని ఆయన అన్నారు. సభ్యత్వం తీసుకున్న వారికి శ్వాస్ ప్రమోషనల్ బాగ్స్, గుర్తింపు అందచేయటం జరుగుతున్నదని. గుర్తి,పుకార్డులను కూడా అందజేస్తున్నామని పీతాంబరం వేంకటకిశోర్ వెల్లడించారు. సభ్యుల కూర్పులో భాగంగా అధ్యక్ష, కార్యదర్శి, ఉపాధ్యక్ష వంటివి కాకుండా, అందరూ రామానుజ సైనికుల్లాగా భగవత్, భాగవత, ఆచార్య, సంప్రదాయ సేవ చేయటానికి శ్వాస్ - పంచయుక్త కమిటీలు, గౌరవ అధ్యక్షులు, గౌరవ సలహాదారులు, ఆగమ సలహాదారులు, న్యాయ సలహాదారులు ఏర్పాటు చేసుకున్నాము. అన్నిజిల్లాలకు శ్వాస్ - జిల్లా సమన్వయ ప్రతినిధులు / విభాగాలు ప్రారంభం అయ్యాయి అని, ఆళ్వార్ కోర్ కమిటీ - ప్రధాన మార్గదర్శక కమిటీగా కేంద్రకమిటీగా పనిచేస్తున్నదని ఆయన వెల్లడించారు.

శ్రీవైష్ణవ సర్వేక్షణ - రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మన శ్రీవైష్ణవ కుటుంబాల సమగ్ర వివరాల సేకరణకు సర్వే చేయటం ప్రారంభించిందని ఆయన వెల్లడించారు. అంతే కాకుండా అవసరమైన సేవలు (ముఖ్యంగా వివాహ సంబంధాలు, ఆరోగ్య రక్షణ భీమా వంటివి) అందించటానికి కావాల్సిన కార్యాచరణ జరుగుతుందని, శ్రీసంప్రదాయ శిక్షణ - ఉద్యోగస్తులకు, మహిళలకు, పిల్లలకు, సాంప్రదాయ విద్యను అభ్యసించాలని ఆసక్తి ఉన్నవారందరికి అంతర్జాల మాధ్యమం ద్వారా శ్వాస్ - శ్రీసంప్రదాయ శిక్షణ పూర్తి ఉచితంగా అందిస్తున్నాము. ప్రతీవారం లబ్ధప్రతిష్ఠులైన పండితులతో ఒకరోజు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాము. శ్రీ ఉ.వే. శ్రీమాన్ కరి పురుషోత్తమాచార్యులు గారు, తిరుపతి వేదిక్ యూనివర్సిటీ, శ్రీ ఉ.వే. శ్రీమాన్ రఘునాథ భట్టర్ స్వామి, శ్రీరంగధామం, రాజమండ్రి వంటి ఎందరో మహానుభావులు నిరంతరం సేవలు అందిస్తున్నారని పీతాంబరం వేంకటకిశోర్ వెల్లడించారు.

గత సంవత్సరం అక్టోబర్ 29,30,31 వ తేదీల్లో శ్వాస్ - ప్రథమ వార్షికోత్సవ ప్రయుక్త ఉభయ వేదాంత సభలు, ముచ్చింతల్ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో అత్యంత వైభవముగా జరిగాయి. సభలకు మహా మహోపాధ్యాయ డాక్టర్ శ్రీ ఉ.వే శ్రీమాన్ సముద్రాల రంగ రామానుజాచార్య స్వామీ వారు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నించి 10 మంది ఉభయ వేదాంత పండితులు ప్రవచనాలు అందచేశారు. వార్షికోత్సవ సభల్లో భాగంగా శ్రీవైష్ణవ యువ పండితులను, ఉన్నత స్థానాల్లో సుదీర్ఘమైన సేవలు అందించిన

# శ్రీవైష్ణవ ఆగమ సంప్రదాయ సేవాసమితి (శ్వాస్) కార్యదర్శి నివేదిక



శ్రీవైష్ణవ పెద్దలను, తెలంగాణా రాష్ట్ర ఆగమ, సంస్కృత, జ్యోతిష్య సలహామండలి పెద్దలను, న్యాయవాదులను సత్కరించుకున్నామని వారు తెలిపారు.

శ్వాస్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాల సంపూర్ణ సమాచారాన్ని క్రోడీకరించి అక్షర కైంకర్యం అందించిన శ్రీ సన్నిధానం మాగజైన్ నిర్వాహకులకు సభాముఖంగా పీతాంబరం వేంకటకిశోర్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధానంగా వార్షికోత్సవ వేడుకల సంచికను చీఫ్ ఎడిటర్ వొద్దిపర్తి రామచంద్రమూర్తి, మేనేజింగ్ ఎడిటర్ డింగరి శ్రీనివాస మూర్తి, ఒపీనియస్ ఎడిటర్ సముద్రాల శారదలు రూపొందించారని వారిని సభకు పీతాంబరం వేంకటకిశోర్ పరిచయం చేశారు.

శ్రీరామానుజ సహస్రాబ్ది సమారోహం కార్యక్రమంలో ఋత్విక్లుగా పాల్గొనాలనే ఆసక్తి ఉన్న మన శ్రీవైష్ణవులకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అనేక మంది ఋత్విక్‌లకు ప్రత్యక్ష తరగతుల ద్వారా, అంతర్జాల మాధ్యమం ద్వారా సంప్రదాయ శిక్షణ అందించామని వెల్లడించారు. ఈ తరగతుల నిర్వహణలో మాకు సహకరించిన ఎందరో మహానుభావులు, అందరికి పేరు పేరునా ధన్యవాదాలు అని వెల్లడించారు. శ్రీమాన్ కందాళై రమణాచార్య, శోభ గారు నిర్వహిస్తున్న శ్రీవైష్ణవ కళ్యాణ వేదికను శ్వాస్ గుర్తించి వారి సేవలను ప్రశంసించి సన్మానించింది. అంతే కాకుండా ఇప్పటివరకు శ్వాస్ నిర్వహించిన కార్యక్రమాలను సోదాహరణంగా వారు వెల్లడించారు. భవిష్యత్ కార్యక్రమాలలో కలిసి రావాలని పిలుపు నిచ్చారు.






**రమణీయం కమనీయం ఆద్యంతం శ్వాస్ ద్వితీయ వార్షికోత్సవం. అత్యంత విలక్షణమైన మన శ్రీవైష్ణవ సంప్రదాయానికి సంస్కృతవాఙ్మయం, ద్రవిడవాఙ్మయం రెండు కళ్ళ వంటివి. వీటిలోని ప్రధానాంశాలతో ప్రవచనకర్తల అమృతప్రవచనాలు సుమధురం. వాటిలో దాగిఉన్న రహస్యాలను శ్రీమాన్ సముద్రాల వేంకట రంగ రామానుజాచార్య స్వామివారి సమన్వయం చేస్తూ విడమరచి అందిస్తుంటే.. వీనుల విందుగా సాగాయి. ఈ విందు దృశ్య మాలికగా అందిస్తున్న ప్రయత్నాన్ని స్వాగతించండి! ఆస్వాదించండి!!**

## ఆలయ నిర్మాణ వైశిష్ట్యం

### శ్రీమాన్ గోపి నంబాళ నల్ల కూర్మన్న



ఆలయ నిర్మాణ ప్రక్రియ వైభవాన్ని గురించి శాస్త్ర ప్రమాణ పూర్వకంగా విధి విధానాలను శ్రీమాన్ గోపి నంబాళ నల్ల కూర్మన్న గారు వివరించారు. ఆరాధన కార్యక్రమాల్లో ఏ విధమైన నిర్మాణం చేయాలి, ప్రక్రియలు ఎలా ఉండాలి, మరియు న్యాసములకు సంబంధించిన విశేషాలను ఎంతో స్పష్టంగా ఆచరణకు అనువుగా గంభీర అంశాలను వివరించారు.



# ఉత్తరాకాండ తోనే శ్రీరామాయణం పరిపూర్ణం

శ్రీమాన్ శ్రీస్థలశాయి స్వామివారు ప్రవచిస్తూ శ్రీ రామాయణంలోని ఉత్తరాకాండ ప్రాధాన్యాన్ని ప్రసంగించారు. శ్రీ రామాయణంలో ఆరు కాండలతో పాటుగా ఉత్తర కాండ కూడా ఒక భాగమే. వేదాలలో పూర్వ భాగం ఉత్తర భాగం ఉన్నట్లే, వేద ధర్మాలు కలిగింది కనుక రామాయణంలో కూడా ఉత్తర కాండ చెప్పబడింది. చాలామంది అభిప్రాయం ఆరు కాండలు రామాయణ పారాయణం చేస్తే చాలు. ఆరవ కాండ వరకే పట్టాభిషేకంతో ముగిస్తే చాలని అభిప్రాయం. వేదాలను దృష్టిలో పెట్టుకొని రామాయణం వాల్మీకి రచించాడు అనుటకు ప్రమాణం వేదం 4 భాగాలలో యజుర్వేదం ప్రధానమైనది. యజుర్వేదాన్ని దృష్టిలో పెట్టుకొని రామాయణాన్ని వాల్మీకి రచించాడు. ప్రతి ఒక్కరికి ముందుగా కనపడేవాడు సూర్య భగవానుడు, కర్మసాక్షి, జగచ్చక్షువు ఆయిన సూర్యుడు ఒక్కో సందర్భంలో ఒక్కో వేదాధ్యయనంలో ఉంటూ మధ్యాహ్న సమయంలో యజుర్వేద అధ్యయనంలో ఉంటాడు.



మధ్యాహ్న కాలమందు సూర్యవంశజుడైన శ్రీరామచంద్రుడు అవతరించాడు. కనుక వాల్మీకి యజుర్వేదం ఆధారంగా చేసుకొని రామాయణం రాశాడు. ఆ విధంగానే వేద ధర్మాన్ని రామచంద్రుడు అనుసరించాడు. అటువంటియజ్ఞాలు అనేకం ఆచరించిన సర్గలు ఉత్తరాకాండలోనే ఉన్నాయి. కనుక ఉత్తరాకాండ ప్రధానము. యజ్ఞ పురుషుడైన, తేజోమూర్తి అయిన విష్ణువును దేవతలు అనుసరిస్తూ ఉండగా ధనుర్బాణాలు చేతిలో ఉద్భవించాయి. ఆ విధంగానే అటువంటి పుణ్య స్వరూపంతో శ్రీరామచంద్రుడు ఉద్భవించాడు. ఉత్తరకాండలోనే భగవత్ సంబంధం కలిగిన అంశాలు ఉంటాయి. ఉత్తర భాగం ఉపబృంహణముగా చెప్పబడినది. కానీ రామాయణంలో వేరు కాదు. సీతాదేవిని వదలటం ధర్మం, యజ్ఞాలు చేయడం ధర్మం ఇలాంటి వేద ధర్మాలు తెలియ చేయబడినది ఉత్తరకాండ. ఆళ్వార్లు కూడా రామావతారాన్ని స్తుతిస్తారు. మృత సంజీవని వంటిది శ్రీరాముని వృత్తాంతం. ఇలాంటి ఎన్నో అంశాలు ఉత్తరాకాండలో ఉన్నాయి. ఉత్తరాకాండయుతమైన రామాయణాన్ని అధ్యయనం చేయాలి. పూర్వోత్తర కాండలు అధ్యయనం చేస్తేనే మన పూర్వాచార్యులను అనుసరించినట్టు అవుతుంది, పరిపూర్ణం అవుతుంది.

## అరణ్యకాండ ఉత్తమ కాండ

-విదుషీమణి కె.వి.జానకమ్మ



శ్వాస్ వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ అరణ్యకాండ వైశిష్ట్యాన్ని ప్రవచించారు. అరణ్యకాండ వైభవాన్ని చెప్పు మనుటకు కారణాన్ని ఆలోచిస్తే ! "ఉత్తమ కాండ" అయినది అరణ్యకాండ అని ఆ విశేషాలను తెలిపమనటం పెద్దల ఉద్దేశం. కథాంశాన్ని బట్టి అరణ్యకాండ అని పేరు పెట్టినా, పురుషార్థ ప్రాప్తిని తెలియచెప్పుంది కనుక ఉత్తమ కాండ. ధర్మార్థ కామ మోక్షాలలో ఉత్తమ పురుషార్థమైన మోక్షం యొక్క ఉత్తమ పురుషుడైన తేజోమూర్తి అయిన పరమాత్మ దర్శనాన్ని పొందుటకు అవకాశం ఇచ్చిన కాండ. శ్రీరామచంద్రుడు అరణ్యంలో ఆనందంగా ఉన్నాడు కనుక ఉత్తమ కాండ అంటూ ప్రవచించారు.



## ఆరాయిరప్పడి

-టి.కె చూడామణి

ఆరాయిరప్పడి వైభవం, తిరువాయ్ మోజీ అవగాహనలో ఉపయోగం గురించి ప్రసంగిస్తూ మంత్ర రాజ, ద్వయ మంత్ర, చరమశ్లోక వైభవం, ఆళ్వార్ల పూర్వాచార్యుల కృతులలో ఏవిధంగా చెప్పబడ్డాయో ప్రమాణాలతో ప్రవచించారు.

## ప్రమాణంగా పాంచరాత్రాగమము


శ్రీమాన్ ముడుంబై మధుసూదనా చార్య స్వామి



శ్రీప్రశ్న సంహిత మహోత్సవ నిరూపణ ప్రక్రియ విశిష్టత అనే అంశంపై ప్రవచనం చేస్తూ, పాంచరాత్ర ఆగమ విశిష్టతను వివరించారు. భగవద్ రామానుజాచార్యులను, ఉపనిషత్తులోని భగవద్ వైభవాన్ని నిరూపిస్తూ పాంచరాత్రాగమము లోని అనేక విషయాలు ప్రమాణంగా చెప్పారు. భగవద్ రామానుజాచార్యుల పాంచరాత్ర ఆగమ వైభవాన్ని వివరిస్తూ ప్రవచించారు.

## శ్రీరామానుజ దర్శన నిరూపణం


శ్రీమాన్ వంగల వెంకటాచార్య స్వామి



భగవద్ విషయం ప్రవేశం. శ్రీరామానుజ దర్శన నిరూపణం అనే దత్త శీర్షికపై అనుగ్రహ భాషణం చేశారు. సంప్రదాయంలో తత్త్వ త్రయానికి గొప్ప ప్రాధాన్యం ఉంది. దానిని తప్పక అందరు తెలుసుకోవాలి. తత్త్వాన్ని అనేక సంఖ్యలతో ఎందరో చెప్పారు. కానీ తత్త్వము త్రయము మాత్రమే. అని పూర్వాచార్యుల శ్రీసూక్తులను ప్రమాణంగా తెలుపుతూ అనుగ్రహ భాషణం చేశారు.

## అమ్మ ద్వారా వచ్చిన సాంప్రదాయం

శ్రీమాన్‌సముద్రాల శఠగోపాలాచార్య



భగవద్ రామానుజాచార్యులకు పూర్వం శ్రీవైష్ణవం ఉందా ఎలా ఉంది అనే శీర్షిక పై ప్రవచించారు. శ్రీవైష్ణవ గురు పరంపర అనుష్టానం వరుసక్రమం వివరించారు. లక్ష్మీనాథ సమారంభాం అని స్వామి నుండి అమ్మ ద్వారా వచ్చింది మన సాంప్రదాయం. మనకు ఉపకారం చేసిన గురు పరంపరను అనుసంధించుకునే గొప్ప సాంప్రదాయం మనది అంటూ అనుగ్రహభాషణం కొనసాగించారు.

# సంప్రదాయానికి శ్వాస: అహోబిల జీయర్ స్వామి

శ్వాస ఎంత ప్రధానమో సంప్రదాయానికి శ్వాస్ అంత ప్రధానం అని ప్రారంభించి ప్రవచనం కొనసాగించారు. మంచి మాటలు అంటే ఏమిటి అని తెలుపుతూ సీతమ్మ వారి వద్ద హనుమంతుడు మాట్లాడిన పలుకులను తెలిపారు.

ప్రేరణ కలిగించే పెద్దల మాటలు అందరికీ మంచిని కలిగిస్తాయన్నారు. పెద్దలు చెప్పినది అనుసరించడం మన సంప్రదాయం. శ్రీరామానుజాచార్యుల వైభవాన్ని భగవద్విషయాలను మన పెద్దలు అందిస్తున్నారు. శ్రీసాంప్రదాయం భగవంతుడే చెప్పినది. లక్ష్మీదేవిని పురుషకారంగా తెలిపే ఈ గొప్ప సంప్రదాయం రక్షణ కోసం అనగా ఆచరణ కోసం అందరూ తోడ్పడుతున్నారు. సంప్రదాయానికి చేసే సేవలను చెబితే తప్పులేదు అని మంగళాశాసనం చేశారు.



శ్రీరామానుజ సహస్రాబ్ది వార్షికోత్సవ సందర్భంగా శ్రీ చిన్న జీయర్ స్వామివారి సంకల్పానుసారంగా ఫిబ్రవరి 11వ తారీఖున ఒక లక్ష మందితో భగవద్గీత పారాయణం


5వ తారీఖున రామానుజ నూత్తందాది సామూహిక పారాయణం ఏర్పాటు చేయబడుతుంది. ప్రపన్నులైన ప్రతి ఒక్కరూ రామానుజ నూత్తందాది తప్పక చదవాలి. ప్రపన్న గాయత్రిని అందరం కలిసి చేయవచ్చును. తొమ్మిది రోజులు జరిగే కార్యక్రమాల్లో అందరూ పాల్గొనాలి.

అని అనుగ్రహభాషణం చేసి శ్వాస్ కార్యక్రమ నిర్వాహకులకు, సహకరించిన వారికి మంగళాశాసనం చేశారు.

శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి ప్రవచనామృతం

# 'సర్వం విష్ణుమయం జగత్'

**శ్రీమత్ పరమహంస పరివ్రాజకాచార్యులు, జగదాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి ప్రవచనామృతం గ్రోలాలని ఎవరికి ఉండదు? శ్వాస్ సభ్యులకు వారు వస్తారని మంగళాశాసనాలు అనుగ్రహిస్తారని ఉత్కంఠ! వేచి చూసిన జనం ఆశ నిరాశ చేయరు భక్తవల్లభుడు. కరుణించి వచ్చారు.వాగమృతధార వర్షంలా కురిపించారు**



శ్రీ వైష్ణవ సంప్రదాయ అభివృద్ధి కొరకు యువకులంతా కలిసి ఆరంభించిన, ఏర్పాటు చేసినటువంటి ఒక చక్కటి సేవా సంస్థ. గతంలో ఉభయ వేదాంత సభలు లేదా ఇతర సదస్సులు ఇలాంటివి ఒక వయసు దాటిన వాళ్ళు ఏర్పాటు చేసుకుంటూ ఉండేవారు. గత రెండేళ్లుగా 40 ఏళ్ల లోపు ఉండే యువకులంతా కలిసి సంప్రదాయం కోసం ఏదైనా చేయాలి అని ఒక కార్యక్రమం ప్రారంభించారు. బాధ్యత తీసుకున్న ఆ యువకులు స్ఫూర్తితో శ్వాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వారికందరికీ మంగళాశాసనం చేస్తున్నాము.వారితో పాటు మీ అందరికీ మంగళాశాసనం చేస్తున్నాం, ఎందుకంటే ఈ కార్యక్రమాన్ని వదలకుండా మీరందరూ తోడుంటూ నిర్వహిస్తున్నందుకు అంటే ఈ కార్యక్రమాల మీద ఎంత నిష్ఠ పట్టుదల ఉన్నాయో తెలుస్తోంది. తోడు ఉంటే ఏదైనా సాధించవచ్చు. మీ అందరి తోడ్పాటు ప్రోత్సాహం ఇవే వీళ్ళందరికీ నిజమైన శ్వాస. అని ప్రవచనాన్ని ప్రారంభించి సహకరించిన అందరికీ మంగళాశాసనం చేసి కొనసాగించారు. శ్రీ వైష్ణవ సంప్రదాయ బాధ్యతను మహానుభావులైన మన పూర్వాచార్యులు సమాజంలో ఉండే అడుగు వర్గాల దాకా తీసుకు వెళితే ఇప్పటికీ ఆ సాంప్రదాయంలో మేమున్నాం అని దానికి ప్రతినిధులుగా దాసరులు కూడా ఇక్కడకు వచ్చారు.

ప్రపంచంలో రెండు రకాల జనాలు ఉంటారు. ఒకరు తానెవరో గుర్తించినవారు, రెండు మరిచిపోయే వాళ్ళు. వైష్ణవం కానిది ఏదీ లేదు 'సర్వం విష్ణుమయం జగత్' ఈ

⇨

# వెంకటాచలం, శ్రీ రామానుజ సంబంధం

## శ్రీమాన్ ఈ.ఎ. శింగరా చార్య స్వామి

శ్వాస్ వారిని ప్రశంసిస్తూ శీర్షికపై సమగ్ర సమాచారాన్ని తెలియపరిచే విధంగా ప్రవచనం చేశారు.

సుందర బాహు చరిత్రలో స్తుతించినట్టు రమ్యము, సుందరము అయిన భగవంతుని కథ చిన్నదైనా పెద్దదైనా అది మధురమే! అన్నట్టు శ్రీరామానుజుల వారికి సంబంధించిన అంశము ఎటువంటిదైనా అది మధురమే! ఆస్వాదించతగినదే! వెంకటాచలంతో వారికి సంబంధం ఉన్నది. తిరుమల నంబి మేనమామగాగలిగి, చిట్టచివరగా



తిరుమలలో జీయర్ వ్యవస్థను పటిష్ఠితం చేసేవరకు కొనసాగుతుంది.

వెంకటేశ్వర స్వామి ఆరాధనలో ఏలోపం రాకుండా ఉండడానికి రెండు జీయర్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. రామానుజాచార్యులు దీర్ఘదర్శి, భవిష్యదృష్టి గలవారు, సంప్రదాయవాది అని వివరించారు. రామానుజాచార్యులకు వెంకటచలానికి గల సంబంధాన్ని, తిరుమల విష్ణు క్షేత్రంగా నిరూపించిన విధానాన్ని ప్రవచించారు.

# ‘సర్వం విష్ణుమయం జగత్’



ప్రపంచమంతా కూడా వ్యాపించి నటువంటి ఏకైక తత్వం. ప్రతి చోటా వ్యాపించినది విష్ణు తత్వం. ‘విష్ణు’ అంటే
వ్యాపించినది. అణువు నుండి విశ్వాంతరాల దాకా అంతటా వ్యాపించిన తత్వాన్ని గుర్తించి అందించినవి వేదాలు. వేదాలు అందించిన దాన్ని ఆచార్యులు స్వీకరించి అందంగా, ఆచరణాత్మకంగా సిద్ధాంతం చేసి ఈ సమాజానికి అందించారు. విష్ణు తత్వానికి నేను చెందిన ఒక వ్యక్తిని అని అనుకున్న వాళ్ళు అందరు వైష్ణవులే! వారు బ్రాహ్మణులా, హరిజనులా, ధనవంతుడా, ధనహీనుడా అనే ప్రశ్నే లేదు. నేను కూడా ఆ విష్ణువుకు సంబంధించిన వాడనే అని గుర్తించిన ప్రతి వారికి ఒకటే పేరు వైష్ణవ. ఇది శారీరకమైన కులానికి చెందినది కాదు. పుట్టుకతో వస్తాయి. కట్టెలతో పోతాయి. ఎప్పటికీ తరగక మారక ఉండేది ఒకటే! అది సర్వత్రా వ్యాపించిన తత్వం. మనకు ఉండే సంబంధం గాలి, చలి, వేడి వ్యాపించి ఉంది అంతటా, వ్యాపించినటువంటి ఈ తత్వాలను నిలబెడుతూ ఉండేటటువంటి అద్భుతమైన శక్తి విశేషానికి విష్ణు అని పేరు పెట్టాయి మన వేదాలు. విష్ణువు యొక్క తత్వానికి సంబంధించిన వాణ్ణి అనుకునేవారు కొందరుంటారు ప్రపంచంలో. దానిని గుర్తించడానికి ఇష్టపడని వాళ్ళు కొందరు ఉంటారు.

ఈ సిద్ధాంతాన్ని అందించిన మహానుభావుడు శ్రీ రామానుజాచార్యులు. ఈ సిద్ధాంతం ఎప్పటినుండో వేదాల్లో ఉంది. కానీ దాన్ని పైకి తెచ్చి చూపించిన మహనీయులు. దాన్ని లోకమంతా వ్యాపింప చేసిన మహనీయులు రామానుజాచార్య స్వామి. వాస్తవాన్ని వారు గుర్తించారు. గోపురం ఎక్కి మంత్రాన్ని లోకానికి చాటారు.

మంచి మార్పు చేయగలిగే సామర్థ్యం రామానుజుల వారికి ఏర్పడింది. వారు దేశమంతా సంచరించి అక్కడ ఉండే వ్యక్తులకు తత్వాన్ని తెలియజేసి, ఇతర ఆలోచనలను మార్పు చేసి, అణగార్చి వారిలో ఈ ఆలోచన బీజాన్ని నాటి, మొలకెత్తే విధంగా చేశారు. సుమారు 6, 7 వందల సంవత్సరాల కాలం వారు చేసిన కృషి సత్ఫలితాలను ఇస్తూనే ఉంది. అన్యుల పరిపాలనా, సిద్ధాంతాల వల్ల సుమారు మూడు వందల సంవత్సరాలు దీని విస్తృతి తగ్గిందే గానీ నాశనం కాలేదు. కనుకనే ఇప్పటికీ ఎక్కడో సమాజంలో అట్టడుగు వర్గాలు దళితులు అని దూరం చేసే వ్యక్తుల్లో కూడా “అడియేన్” అని అగలిగిన సంప్రదాయం మిగిలి ఉంది. .రామానుజాచార్యులు నాటిన బీజాలు నేటికి నశించకుండా సజీవంగా ఉన్నది అంటే ఆ మహానుభావుడు మనకి మనకు ఇచ్చిన మహోపకారం ఎంతటిది. మన దాకా వచ్చిన సంప్రదాయాన్ని కాపాడగలుగుతున్నాం. ఈ సాంప్రదాయం మన వరకు వచ్చేలా మన పెద్దలు మనకు ఇచ్చారు. పంచ సంస్కారాలు పొందినవారిని ఎవరినయినా వైష్ణవ అంటారు. మనము మన ముందు తరాలకి ఈ సాంప్రదాయాన్ని ఇవ్వాలి. రామానుజాచార్యులు చేసిన మహోపకారం అది. కానీ కాలక్రమంలో ఇది మరిచిపోతున్నాం. ఈ సంప్రదాయాన్ని అన్ని వర్గాల వారిని ఒక వైష్ణవ కుటుంబం లోకి తీసుకు వస్తుంది. కాబట్టి ఈ సాంప్రదాయ సంపదనూ వదులుకోవచ్చునా?.

ఆలోచించాల్సిన సమయం వచ్చింది. మన కుటుంబాల్లో పిల్లల్ని సాంప్రదాయానికి వారసులు చేయాలి. ఆ సాంప్రదాయాన్ని మనం ఆచరించాలి. అని సాంప్రదాయం, వైష్ణవం గురించి తెలుపుతూ మంగళాశాసనం చేశారు. ★

## సుదర్శన వైభవం

**– శ్రీమాన్ పాల్వంచ తిరుమల గుడిమెళ్ళ భరత శేఖరాచార్య**

శ్రీమాన్ పాల్వంచ తిరుమల గుడిమెళ్ళ భరత శేఖరాచార్య సుదర్శన వైభవాన్ని సప్రమాణంగా వీరు ప్రసంగించారు. భగవంతుడైన విష్ణువుతో సంబంధం కలిగిన స్వామి సుదర్శన భగవానుడు.



ఎవరైతే తప్త చక్రాంకితాలు పొందగలుగుతారో వారు మోక్షం పొందగలుగుతారు. అని వివరిస్తూ భారద్వాజ దుర్వాస మహర్షి సంవాదంగా నారద శంకరుల సంవాదంగా అహిర్బుధ్న్య సంహిత యందలి సుదర్శన భగవానుని వైభవాన్ని వివరించారు.

# శ్వాస్ ద్వితీయ వార్షికోత్సవ దృశ్య మాలిక











# శ్వాస్ ద్వితీయ వార్షికోత్సవ దృశ్య మాలిక



# శ్వాస్ ద్వితీయ వార్షికోత్సవ దృశ్య మాలిక



# శ్వాస్ వార్షికోత్సవంలో శ్రీసన్నిధానంకు ప్రశంసలు







శ్వాస్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలలో అక్షర కైకర్యం అందించిన శ్రీసన్నిధానం సంపాదక మండలికి శ్వాస్ వేదికపై అభినందనలు తెలియ జేసింది. శ్వాస్ ప్రథమ వార్షికోత్సవంలో ప్రవచనాలను యథాతథంగా శ్రీసన్నిధానం శ్వాస్ వార్షికోత్సవ సంచికను అక్షర కైంకర్యంగా రూపొందించి అందించింది. ఈ సేవలో సంచికను చీఫ్ ఎడిటర్ వొద్దిపర్తి రామచంద్రమూర్తి, మేనేజింగ్ ఎడిటర్ డింగరి శ్రీనివాస మూర్తి, ఒపీనియన్ ఎడిటర్ సముద్రాల శారదలు పాల్గొన్నారని శ్రీసన్నిధానం మేనేజింగ్ ఎడిటర్ ఒక ప్రకటనలో తెలిపారు. తమ సేవలను గుర్తించినందుకు శ్వాస్ కేంద్రకమిటీకి, నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిజేశారు. జాతీయ స్ఫూర్తితో, భాగవతోత్తముల సేవే పరమావధిగా శ్రీసన్నిధానం నిరంతర కృషి చేస్తుందని వారు పేర్కొన్నారు. ఇప్పటికే ఆన్‌లైన్‌లో శ్రీసన్నిధానం డాట్ ఒఆర్‌జిలో పత్రిక తిలకించవచ్చని, దేశ విదేశాలలో సైతం తమ డిజిటల్ సంచికను తిలకిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సంచిక తిల కించి అభిప్రాయాలను తెలుపాలని కోరారు. ★

## శ్రీ వైష్ణవ ఆగమ సంప్రదాయ సేవా సమితి (శ్వాస్)

సదా ఆచార్య సేవకై అంకితం

Regd No. 820/2020 Hyderabad.

www.svass.org; Email : ramanuja@svass.org; Ph : 6304062846, 9502777196

*అక్టోబర్ 29,30,31 వ తేదీల్లో శ్వాస్ - ప్రథమ వార్షికోత్సవ ప్రయుక్త ఉభయ వేదాంత సభలు, ముచ్చింతల్ జీయర్ స్వామివారి ప్రత్యక్ష పర్యవేక్షణలో అత్యంత వైభవముగా జరిగాయి. సభలకు మహా మహోపాధ్యాయ డాక్టర్ శ్రీ ఉ.వే శ్రీమాన్ సముద్రాల రంగ రామానుజాచార్య స్వామీ వారు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నించి 10 మంది ఉభయ వేదాంత పండితులు ప్రవచనాలు అందచేశారు. వార్షికోత్సవ సభల్లో భాగంగా శ్రీవైష్ణవ యువ పండితులను, ఉన్నత స్థానాల్లో సుదీర్ఘమైన సేవలు అందించిన శ్రీవైష్ణవ పెద్దలను, తెలంగాణా రాష్ట్ర ఆగమ, సంస్కృత, జ్యోతిష సలహామండలి పెద్దలను, న్యాయవాదులను సత్కరించుకున్నాము. శ్వాస్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాల సంపూర్ణ సమాచారాన్ని క్రోడీకరించి అక్షర కైంకర్యం అందించిన శ్రీ సన్నిధానం మాగజైన్ నిర్వాహకులకు*

*ధన్యవాదాలు తెలియచేస్తున్నాము*




1. వొద్దిపర్తి రామచంద్రమూర్తి-చీఫ్ ఎడిటర్
2. సముద్రాల శారద-వొపీనియన్ ఎడిటర్
3. డింగరి శ్రీనివాసమూర్తి -మేనేజింగ్ ఎడిటర్




శ్రీసన్నిధానం












yono SBI
SBI Payments
MERCHANT NAME: SRI SANNIDHANAM CHARITABLE TR
SCAN & PAY
BHIM SBI Pay
BHIM UPI

శ్రీసన్నిధానం పత్రిక రిజిస్ట్రేషన్ కొరకు 9502583323 సంప్రదించండి లేదా srisannidhanam.org లో subscribe చేయండి.

మీ అభిప్రాయాలు మాతో పంచుకోండి, శ్రీసన్నిధానం ట్రస్ట్ లో భాగస్వామ్యం కండి